జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 3 సంచిక - 18 | పక్షపత్రిక | సెప్టెంబర్16-30, 2012

## పట్టణాలలో సురాజ్య శంఖారావం



## పట్టణాలలో రౌండ్‌టేబుల్స్ ప్రముఖుల భాగస్వామ్యం


















విజయనగరంలో

సురాజ్యం రౌండ్‌టేబుల్



గుంటూరు లో

సురాజ్యం రౌండ్‌టేబుల్





జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక సెప్టెంబర్ 16-30, 2012

సంపుటి - 3 సంచిక - 18

## లోపలి పేజీల్లో...

పట్టణాలలో సురాజ్య ఉద్యమం.....................5

లోక్‌పాల్‌లో భాగంగానే లోకాయుక్త.............9

అన్నాబృందం రాజకీయ ప్రత్యామ్నాయం..........10

విద్యను మించి మతం లేదు......................... 13

అడుగుజాడ గురజాడది............................. 17

మనకి ముందుచూపు నిచ్చిన గురజాడ.............20

సురాజ్యం నాకొద్దు .................................. 21

ప్రజాస్వామ్యం నాయ'కుల' స్వామ్యమా?......... 21

జగన్నాధ రథ చక్రాలు............................... 22

పట్టణాలలో సురాజ్య ఉద్యమం .................... 26

వివిధ రాష్ట్రాలలో పంచాయితీలలో
బి.సి. రిజర్వేషన్లు...................................... 34

# స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికలు జరపండి

## సంపాదకీయం

పంచాయితీలకు ఏడాదిగా ఎన్నికలు లేవు. మున్సిపల్ ఎన్నికల గడువు ముగిసి రెండేళ్లు కావస్తున్నది. ఎన్నికలు లేకపోతే ప్రజాప్రతినిధులు వుండరు. కేంద్రం నుండి నిధులు రావు. ప్రజలకు ఆలనా పాలనా కరువైపోతుంది. ఇప్పడున్న పరిస్థితి ఇదే.

హైకోర్టు ఎన్నికలు జరపమని తీర్పు యిచ్చింది. పోతే 50 శాతానికి రిజర్వేషన్లు తగ్గించాలని స్పష్టం చేసింది. పైగా ఈ పరిమితిలోగా రిజర్వేషన్లు ఖరారు చేసి రాష్ట్ర ఎన్నికల కమీషన్‌కు నివేదిక ఇచ్చిన మూడు నెలలలోగా ఎన్నికలు జరపాలని ఆదేశించింది. ఎన్నికల కమీషన్‌కు గడువు పెట్టింది కాని ప్రభుత్వానికి గడువు పెట్టకుండా వదిలేసింది. మున్సిపల్ ఎన్నికలపై తీర్పు మరింత విడ్డూరంగా వుంది. 2011 జనగణన వివరాలు అందిన తర్వాత నాలుగు నెలలలోగా ఎన్నికలు జరపాలని తీర్పు చెప్పింది. జనగణన లెక్కలు రావు, ఇప్పట్లో ఎన్నికలు జరిగే సూచనలు లేవు. గడువులోగా స్థానిక ప్రభుత్వాలకు విధిగా ఎన్నికలు జరిగితీరాలి. ఇది రాజ్యాంగ ఆదేశం. దీనిని ఏదో ఒక సాకుతో వాయిదాలు వేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు లేదు. ఇలాంటి రాజకీయ వాయిదాలకు కోర్టులు అనుమతించాల్సిన అవసరం గాని అవకాశం గాని లేదు. కాని ఇలాంటి తీర్పులు వస్తూనే వున్నాయి.

2000 సంవత్సరంలో జరగాల్సిన పంచాయితీ ఎన్నికలని ఆనాటి తెదేపా ప్రభుత్వం 5 అంచెల వ్యవస్థను 3 అంచెల వ్యవస్థగా మార్పించి ఎన్నికలు జరిపిస్తామని చెప్పి వాయిదా వేసింది. కోర్టు జోక్యం తర్వాత ఏడాదికి ఎన్నికలు జరిగాయి. వాస్తవానికి ఇప్పటికీ అయిదంచెల వివాదం తేలలేదు.

అలాగే రిజర్వేషన్లపై 50శాతం పరిమితి విధిస్తూ 2010లోనే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిపాటు పట్టించుకోకుండా ఆ తీర్పుకు భిన్నంగా పంచాయతీ ఎన్నికలు జరపనున్నట్టు ప్రకటించింది. దీనికి కోర్టు అనుమతించదని తెలిసి, కావాలని చేసిన పని ఇది. ఇప్పడు రిజర్వేషన్లు కుదింపు సమస్యను అడ్డం పెట్టుకుని ఈ రెండు పార్టీలు ఎన్నికల వాయిదా చుట్టూ తమ వ్యూహాలను ప్రకటిస్తున్నాయి. సుప్రీంకోర్టుకు వెళ్ళాలని అధికార పక్షం, రాజ్యాంగసవరణ చేసైనా రిజర్వేషన్లు తగ్గకుండా మాత్రమే ఎన్నికలు జరపాలని ప్రధాన ప్రతిపక్షం వాదిస్తున్నాయి. ఇవి రెండూ ఇప్పట్లో జరిగేవి కావని వారిద్దరికీ తెలుసు. ఇప్పడు ఎన్నికలు వస్తే ఈ పార్టీల పరిస్థితి ఏమిటి అన్నదే వీరిని వేధిస్తున్న అసలు సమస్య. వాళ్ళ గెలుపు ఓటముల కోసం స్థానిక ప్రభుత్వాల ఎన్నికలను బలిపెట్టడం కంటే దారుణం మరొకటి వుండదు.

ఇక బి.సి. రిజర్వేషన్లపై శాశ్వత పరిష్కారం ఎప్పటికి వచ్చినా తక్షణం దానిని అధిగమించడానికి తగిన భరోసా ఇచ్చి ఎన్నికలు నిర్వహించడం సముచితం. ఎందుకంటే తె.దే.పా తాము అధికారంలోకి వస్తే స్థానిక ప్రభుత్వాలలో బి.సి.లకు 50 శాతం సీట్లు ఇస్తానని ప్రకటించింది. శాసనసభకు చట్టం లేకపోయినా 100 సీట్లు ప్రకటించింది. అలాగే బి.సి.లకు 34 శాతం రిజర్వేషన్లు తమ హయాంలో ఇచ్చినవేనని కాంగ్రెస్ వాదిస్తున్నది. ప్రభుత్వం పక్షం, ప్రతిపక్షం చొరవ తీసుకుని అన్ని రాజకీయపక్షాలతో సంప్రదించి బి.సి.లకు తగ్గే 10శాతం రిజర్వేషన్లుస్థానే అదనంగా తమ తమ పార్టీలు సీట్లుకేటాయిస్తామని పోటీ పడి ముందుకొచ్చి తాత్కాలికంగా ఈ సమస్యను సర్దుబాటు చెయ్యాలి. 2001 ప్రాతిపదికన తక్షణం స్థానికప్రభుత్వాల ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేసే విజ్ఞతని ప్రదర్శించాలి. లేకపోతే బి.సి. ల పట్ల ఒలకబోస్తున్న ప్రేమ మొసలికన్నీరే అవుతుంది. ■

## సంపాదకవర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

### సంపాదక వర్గం

జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫొటోలు : ఎన్. సంజీవ్ కుమార్



# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

8-2-674బి/2/9, ప్లాట్ నం : 93
హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,
బంజారాహిల్స్, హైదరాబాద్ – 500 034

**ఫోన్ నంబర్లు :**
**040- 23311817, 23311819, 23311820, 23312829**
**ఫ్యాక్స్ : 040-23310612**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311817**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.




# పట్టణాలలో సురాజ్య ఉద్యమం

## - కొన్ని తక్షణ కర్తవ్యాలు

***రాష్ట్ర సురాజ్య ఉద్యమ కమిటీ కన్వీనర్ డా॥ జయప్రకాష్ నారాయణ్ పట్టణాలలో సురాజ్య ఉద్యమానికి సంబంధించి చేపట్టవలసిన తక్షణ కర్తవ్యాలను ప్రకటించారు. సురాజ్య ఉద్యమ కమిటీలు ఈ కార్యక్రమాలను నిర్వహించవలసిందిగా కోరుతున్నాం.***

సురాజ్యఉద్యమం రాష్ట్రవ్యాపితంగా పట్టణస్థాయి రౌండ్‌టేబుల్‌తో, కళాశాల విద్యార్థుల చర్చలరూపంలో విస్తృతంగా సాగుతున్నది. అన్ని తరగతుల ప్రముఖుల్ని, సంస్థల్ని ఈ ఉద్యమం విశేషంగా ఆకట్టుకుంటున్నది. దీనిని రెట్టించిన ఉత్సాహంతో పట్టుదలతో కొనసాగించాలి.

**ఈ కింది తక్షణ కార్యక్రమాలు నిర్వహించండి.**

### 1. రౌండ్‌టేబుల్స్

ఎ) రౌండ్‌టేబుల్స్ జరిగే ప్రతిచోటా విధిగా సురాజ్యఉద్యమ కమిటీలు ఏర్పడాలి. అందరికీ ఆమోదయోగ్యమైన ఒక అధ్యక్షుణ్ణి, నిత్య కార్యకలాపాలను సమన్వయం చేసే ఒక కన్వీనరు, జమాఖర్చులు నిర్వహించే ఒక కోశాధికారిని ఎంపిక చేసుకోవాలి. ఆసక్తి గల అన్ని సంస్థల ప్రతినిధుల్ని ప్రత్యేకించి విద్యాసంస్థల ప్రతినిధుల్ని, పురప్రముఖుల్ని, ఈ సురాజ్యకమిటీలో సభ్యుల్ని చెయ్యాలి. సురాజ్య ఉద్యమం అందరి ఉద్యమంగా ఈ కమిటీల ఏర్పాటు జరగాలి.

బి) ఇంకా రౌండ్‌టేబుల్ సమావేశాలు జరగని చోట్ల సెప్టెంబర్ 30లోగా వాటిని పూర్తిచెయ్యాలి.

సి) పట్టణ సురాజ్య ఉద్యమ కమిటీ సభ్యుల వివరాలు నమోదు చేసి ఒక కాపీని రాష్ట్ర కార్యాలయానికి పంపించాలి.

### 2. విద్యాసంస్థలు - స్వచ్ఛంద సంస్థలలో చర్చాగోష్టులు

పట్టణ సురాజ్య ఉద్యమకమిటీ చొరవతీసుకుని అన్ని విద్యాసంస్థలలో, లయన్స్, రోటరీ, బార్, ఐ.యం.ఎ. రిటైర్డ్ ఉద్యోగులు, ఇతర ప్రజాసంఘాలలో సురాజ్య ఉద్యమ చర్చావేదికలు నిర్వహింపజెయ్యాలి. సురాజ్యఉద్యమ కమిటీ సభ్యులు వాటిలో పాల్గొనాలి.

### 3) వలంటీర్ల నమోదు - శిక్షణ

ప్రతి సమావేశంలో, చర్చాగోష్టిలో విధిగా వలంటీర్ల కోసం ప్రత్యేక విజ్ఞప్తి చెయ్యాలి. విద్యాసంస్థలతో సహా అన్ని సంస్థల నుండి ఎంతో కొంత సమయాన్ని ఇచ్చే వారందరినీ వలంటీర్లుగా నమోదు చేసుకోవాలి. వారి వివరాలను అక్కడికక్కడే సేకరించుకోవాలి.

పట్టణంలో 40–50 మంది వలంటీర్లు నమోదు కాగానే వారికి ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించితీరాలి. ఇదే భవిష్యత్ ఉద్యమానికి కీలకం.

### 4. అక్టోబరు 1 - విద్యార్థులతో ప్రతిజ్ఞ

అక్టోబరు 1న అన్ని విద్యాసంస్థలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, జాతీయగీతాలాపన చేయించాలి.

### 5) అక్టోబరు 2 - సామూహిక సత్యాగ్రహం

సురాజ్యఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి పట్టణంలో అక్టోబరు 2 – గాంధీ జయంతి పురస్కరించుకుని పెద్ద ఎత్తున సామూహిక సత్యాగ్రహ కార్యక్రమాన్ని నిర్వహించాలి. అందరూ పాల్గొనడానికి, పట్టణం మీద ప్రభావం కలిగించడానికి, తగిన ప్రదేశాన్ని ఎంచుకుని, షామియానాలు కుర్చీలు ఏర్పాటు చేసుకుని వందలాది మందితో జరిగేలా చూడండి. నాలుగైదు గంటలపాటు జరిగేలా, ప్రముఖులంతా మాట్లాడడానికి వీలుగా ఏర్పాట్లు చెయ్యండి – అన్ని పార్టీల ప్రతినిధుల్ని ఆహ్వానించండి.

### 6) భవిష్యత్ కార్యక్రమాలు

సురాజ్యఉద్యమ రాష్ట్ర కమిటీ త్వరలోనే సమావేశమై అక్టోబర్ 2 తర్వాత నిర్వహించాల్సిన కార్యకలాపాలను రూపొందించుకుని మీకు తెలియజేస్తుంది. ■


**నివేదికలు ఈ క్రింది చిరునామాకు పంపండి**

**సురాజ్య ఉద్యమ కమిటీ**

దిల్‌నాజ్ మాన్షన్ ఇ.నెం.7-1-57/2/ఎ, ధరమ్ కరణ్‌రోడ్, అమీర్‌పేట్ హైదరాబాద్ - 500 016

వివరాలకు : 98660 74026

టోల్ ఫ్రీ నం. 18004252688

# దేశంలో సురాజ్య ఉద్యమం



## హైదరాబాద్‌లో లోక్‌సత్తా పార్టీ జాతీయ సదస్సు

అవినీతి అంతానికి, అధికార వికేంద్రీకరణకు, పేదరికాన్ని కొనసాగించే రాజకీయాన్ని ప్రక్షాళన చేసేందుకు, పౌరులకు విద్య, ఆరోగ్యం, ఇతర ప్రభుత్వ సేవలను ఒక హక్కుగా అందించేందుకు, దామాషా ఎన్నికల సంస్కరణలకు, పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పేందుకు దేశవ్యాప్తంగా చిత్తశుద్ధితో కృషిచేస్తున్న వ్యక్తులు, శక్తులు, సంస్థలు ఒకే గొడుగు కింద పోరాడేందుకు కలిసిరావాలని లోక్‌సత్తా పార్టీ జాతీయ నాయకత్వ సదస్సు పిలుపునిచ్చింది.

సెప్టెంబర్ 1,2వ తేదీలలో పార్టీ హైదరాబాద్‌లో జరిగిన లోక్‌సత్తా పార్టీ తొలి జాతీయ నాయకత్వ సదస్సుకు ఏడు రాష్ట్రాల నుంచి, విదేశాలలోని 'పీపుల్ ఫర్ లోక్‌సత్తా' (పి.ఎఫ్.ఎల్) నుంచి 45మంది అగ్రశ్రేణి నాయకులు హాజరయ్యారు.

జాతీయ నాయకత్వ సదస్సు తీర్మానాలను, వివరాలను సెప్టెంబర్ 3న లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇక్కడ పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాకు వివరిస్తూ... అవినీతి అంతం, అధికార వికేంద్రీకరణ, పౌరుల చుట్టూ పాలన, ఎన్నికల, రాజకీయ వ్యవస్థల ప్రక్షాళన ఎజెండాతో 16 ఏళ్ల క్రితం లోక్‌సత్తా పార్టీయే దేశంలో తొలిసారిగా ఉద్యమాన్ని ప్రారంభించిందని, ఆ బావుటాను, ఆ దివిటీని ఈవేళ దేశవ్యాప్తంగా అనేకమంది వ్యక్తులు, సంస్థలు అందుకున్నాయని, వారంతా ఏకమై ఇప్పుడు పోరాడాల్సి ఉందని అన్నారు. ఎన్.సి.పి.ఆర్.ఐలో ప్రధాన భూమిక పోషిస్తున్న అరుణారాయ్, ఇండియా ఎగనెస్ట్ కరప్షన్‌లో కీలక పాత్ర పోషిస్తున్న అన్నా హజారే, సేవ్ డెమోక్రసీ ఫ్రంట్‌కి నేతృత్వం వహిస్తున్న గోవిందాచార్య, నవ్‌భారత్ పేరుతో ఇదే ఎజెండాతో కృషి చేస్తున్న పౌరప్రముఖులు, ఇంకా ఇతర భావసారూప్య సంస్థలు, ప్రతినిధులు కలిసిరావాలని జేపీ విజ్ఞప్తి చేశారు. "ఈ మౌలికాంశాలపై మన మధ్య ఏమాత్రం ఎటువంటి విభేదాలు లేవు. అందుకే వీటి మీద ఏకోన్ముఖంగా పోరాటం చేద్దాం. మిగిలిన విషయాలలో ప్రజాస్వామ్యయుతంగా చర్చించుకుని స్థూల ఏకాభిప్రాయానికి వద్దాం. రండి" అని పిలుపునిచ్చారు.

ఈ అంశాల మీద ఈవేళ దేశవ్యాప్తంగా చిత్తశుద్ధితో పోరాడుతున్న వారి స్థాయిలో, సంఖ్యలో ఏ రాజకీయ పార్టీలో




జాతీయ సదస్సు విశేషాలను విలేకర్లకు వివరిస్తున్న జేపీ

కూడా నాయకత్వం లేదని, వీరంతా కలిస్తేనే భారతదేశానికి సురాజ్యం సాకారమవుతుందని జేపీ అన్నారు. స్వరాజ్యం కోసం కుల, మత, ప్రాంత, భాష, తెగలకు అతీతంగా జరిగిన స్వతంత్ర పోరాటంలోలా, సురాజ్యం కోసం జరుగుతున్న ఈ రెండవ స్వతంత్ర పోరాటానికి కలిసిరండి అని విజ్ఞప్తి చేశారు.

లోక్‌పాల్–లోకాయుక్త–స్థానిక అంబుడ్స్‌మన్ కోసం తన వాదనల్ని వినిపిస్తున్నామని జేపీ తెలిపారు. 6న లోక్‌పాల్‌పై అభిప్రాయాల్ని తెలుపవలసిందిగా పార్లమెంటరీ కమిటీ లోక్‌సత్తాకు ఆహ్వానం పలికిందన్నారు. లోక్‌సత్తా రూపొందించిన పౌరసేవల పత్రం (సిటిజన్స్ ఛార్టర్లు) బిల్లు వివిధ స్థాయిలలో ప్రభుత్వ పరిశీలనలో ఉందని, అలాగే లోక్‌సత్తా చొరవతో విశిష్ట న్యాయకోవిదులు జస్టిస్ వెంకటాచలయ్య, జస్టిస్ జె.ఎస్ వర్మ, జస్టిస్ కృష్ణయ్యర్ రూపొందించిన జాతీయ జ్యుడీషియల్ కమిషన్ బిల్లు, ఇండియన్ జ్యుడీషియల్ సర్వీసు ఏర్పాటు ప్రతిపాదనలు త్వరలో సాకారం కానున్నాయని తెలిపారు.

బొగ్గు కేటాయింపులపై వెల్లువెత్తుతున్న ఆరోపణలపై పక్షపాత రాజకీయాలకు అతీతంగా, దేశప్రయోజనాలను పరిరక్షించేరీతిలో లోక్‌సత్తా పార్టీ చాలా ఆచరణాత్మకంగా స్పందించిందని జేపీ

# సుపరిపాలనకు పోరాడేవారంతా ఏకం కావాలి

ఈ ఎజెండాతో ఉద్యమాన్ని ప్రారంభించిన సంస్థగా ఈ సమిష్టి పోరాటానికి కూడా లోక్‌సత్తా చొరవ తీసుకుంటోందని, అయితే ఉమ్మడి పోరాటానికి తన జెండాను, పేరును కూడా పక్కనపెట్టటానికి లోక్‌సత్తా సిద్ధమని జేపీ ప్రకటించారు. ఈ ఉద్యమానికి నాయకత్వం వహించి దిశానిర్దేశం చేయవలసిందిగా ఆయా సంస్థలను, దేశం కోసం పోరాడుతున్నవారిని జేపీ కోరారు. అందరం కలిసి ఉమ్మడిగా ఒకే వేదికను ఏర్పరిచి, ఒకే గొడుగుకింద సమిష్టి నాయకత్వంతో పనిచెయ్యటం నేటి అవసరమని జేపీ పిలుపునిచ్చారు. "ఇప్పుడున్న చిన్నచిన్న అభిప్రాయ భేదాలని పెద్దవి చేసుకుని, కలిసి పనిచేయకుండా వేరు కుంపట్లతో ఉంటే, అది చరిత్రాత్మకమయిన తప్పిదమవుతుంది. ఈ రెండవ స్వతంత్ర పోరాటం జాతికి నిర్ణయాత్మక పోరాటం కావాలి. ఇందులో వేగంగా విజయం సాధించాలంటే ఐక్యవేదికే శరణ్యం" అని జేపీ తన పిలుపులో పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా వీరందరినీ కలపటానికి లోక్‌సత్తా ఇప్పటికే తన ప్రయత్నాలను ప్రారంభించిందని, ఇందులో తొలిప్రయత్నంగా ఈనెల 6న సమిష్టిగా లోక్‌పాల్‌పై పార్లమెంటరీ కమిటీ ముందుకు హాజరై బలమైన

## జాతీయ అధ్యక్షునిగా జేపీ

### స్టీరింగ్ కమిటీ ఏర్పాటు

సెప్టెంబర్ 2012, 1,2 తేదీలలో జరిగిన లోక్‌సత్తా పార్టీ సదస్సులో జాతీయ అధ్యక్షునిగా డా॥ జయప్రకాష్ నారాయణ్‌ను సదస్సు ఎన్నుకుంది. పార్టీ అధ్యక్షునితోకలిపి 7గురు సభ్యులతో జాతీయ స్టీరింగ్ కమిటీని ఎన్నుకుంది.

**డా॥ జయప్రకాష్ నారాయణ్ (జాతీయ అధ్యక్షులు)**
**సురేంద్ర శ్రీవాస్తవ (మహారాష్ట్ర),**
**(జాతీయ ప్రధాన కార్యదర్శి)**
**అశ్విన్ మహేష్ (కర్ణాటక),**
**అభిజిత్ మెహతా (ముంబయి),**
**ముస్తాన్ తంబావాలా (ముంబయి),**
**అనురాగ్ కేజ్రీవాల్ (ఢిల్లీ),**
**ఎం.బి.ఎస్.వి.వి ప్రసాద్ (హైదరాబాద్)**
**(జాతీయ కోశాధికారి)**

తొలిదశ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరితోపాటు ఒక్కో రాష్ట్రం నుంచి, పి.ఎఫ్.ఎల్ నుంచి ఇద్దరు ప్రతినిధులతో కూడిన జాతీయ జనరల్ కౌన్సిల్‌ను ఎన్నుకోవాలని సమావేశం నిర్ణయించింది.

ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 2జీ స్పెక్ట్రం లైసెన్సుల అక్రమ కేటాయింపులపై కబుర్లు చెప్పటం, గందరగోళం సృష్టించటం కాకుండా ఆ లైసెన్సుల్ని తక్షణం రద్దుచేయాలని సుప్రీంకోర్టులో వాదించి దేశచరిత్రలో తొలిసారిగా 122 లైసెన్సుల్ని రద్దుచేయించింది లోక్‌సత్తా అని జేపీ గుర్తుచేశారు. వాటికి సెప్టెంబర్‌లో బహిరంగ వేలంపాటలు జరుగుతున్నాయన్నారు.

బొగ్గు కేటాయింపులను క్యాప్టివ్ మైనింగ్ పద్ధతిలో చేసే క్రమంలో కొందరికి అప్పనంగా లాభాలు వచ్చాయని 'కాగ్' చేస్తున్న వాదనలో వాస్తవముందని, అందువల్ల అప్పనంగా వచ్చిన లాభాల మీద 'విండ్‌ఫాల్ ప్రాఫిట్స్ పన్ను'ను విధిస్తే ప్రభుత్వానికి వచ్చిన నష్టం పూర్తిగా భర్తీ అవుతుందని, తక్షణం ఈ దిశగా చర్య తీసుకోవాలని అన్ని పార్టీలకూ తెలియచేశామని తెలిపారు. అలాగే ఇకముందు చేయబోయే బొగ్గు కేటాయింపుల్ని బహిరంగ వేలం పద్ధతి ద్వారానే జరపాలని, కేటాయింపులు జరిపిన వెంటనే ఏళ్ల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి లేకుండా తక్షణం బొగ్గు తవ్వకాలు జరిపేందుకు చర్యలు తీసుకోవాలని జయప్రకాష్ నారాయణ్ కోరారు.

లోక్‌సత్తా పార్టీ తమిళనాడు విభాగం అధ్యక్షుడు జగదీశ్వరన్ మాట్లాడుతూ... తమిళనాడులో కూడా బలమైన అవినీతి నిరోధక యంత్రాంగానికి సమయం ఆసన్నమైందని, సురాజ్య ఎజెండాతో పనిచేస్తున్న అన్ని శక్తులనూ కలుపుకుని పోరాటం చేస్తామని తెలిపారు.

లోక్‌సత్తా పార్టీ కర్ణాటక విభాగం అధ్యక్షురాలు శ్రీమతి రామలక్ష్మి మాట్లాడుతూ... ఇండియా ఎగనెస్ట్ కరప్షన్‌లో తాము చురుగ్గా పాల్గొన్నామని, ఇటీవల తమ రాష్ట్రంలో జరిగిన ఎం.ఎల్.సి ఎన్నికలలో విజేతకు సుమారు 6,000 ఓట్లు రాగా, లోక్‌సత్తాకు 4,100 ఓట్లు వచ్చాయని, భవిష్యత్తులో తాము ఖచ్చితంగా మంచి ఫలితాల్ని సాధిస్తామని తెలిపారు.

మీడియా సమావేశంలో లోక్‌సత్తా పార్టీ తమిళనాడు,ఢిల్లీ రాష్ట్ర నేతలు సెంథిల్ ఆర్ముగం, శివ ఇలాంగో, అనురాగ్ కేజ్రీవాల్ కూడా పాల్గొన్నారు. ■




**జాతీయ సదస్సులో సురేంద్ర శ్రీ వాత్సవ, డా॥ జయప్రకాష్ నారాయణ్, అశ్వనిమహేష్, అనురాగ్ కేజ్రీవాల్**

# లోక్‌పాల్‌లో భాగంగానే లోకాయుక్త

## రాజ్యసభ సెలక్ట్ కమిటీకి తేల్చి చెప్పిన లోక్‌సత్తా

రాష్ట్రస్థాయిలో బలమైన లోకాయుక్తల ఏర్పాటును కూడా లోక్‌పాల్, లోకాయుక్తల బిల్లు పరిధిలోకి తేవాలని లోక్‌సత్తా, ప్రజాస్వామ్య సంస్కరణల పీఠం (ఎఫ్‌డీఆర్) ఆధ్వర్యంలోని బృందం రాజ్యసభ సెలెక్ట్ కమిటీకి తేల్చిచెప్పింది. అయితే, లోకాయుక్తల ఏర్పాటుపై తుదినిర్ణయాన్ని రాష్ట్రాలకే వదిలివేయాలని కోరింది.

సత్యవ్రత చతుర్వేది సారథ్యంలోని సెలెక్ట్ కమిటీని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆధ్వర్యంలోని బృందం ఈనెల 6వ తేదీన ఢిల్లీలో కలిసి లోక్‌పాల్, లోకాయుక్తల బిల్లుపై తన వాదనల్ని, సూచనల్ని తెలియచేసింది. ఆ వివరాలను లోక్‌సత్తా పార్టీ మీడియాకు విడుదల చేసింది.

క్రిమినల్ చట్ట నిబంధనలు, నేర పరిశోధన కేంద్రం రాష్ట్రాల ఉమ్మడి జాబితాలోకి వస్తాయి కాబట్టి లోకాయుక్తపై చట్టం చేసే అధికారం పార్లమెంటుకు ఉందని జేపీ బృందం స్పష్టంచేసింది. దాంతోపాటు, ఐక్యరాజ్యసమితి అవినీతి వ్యతిరేక ఒప్పందాన్ని భారతదేశం ధృవీకరించినందున రాజ్యాంగంలోని ఆర్టికల్ 253కింద కూడా అవినీతిపై దేశవ్యాప్తంగా వర్తించే చట్టాన్ని చేసే అధికారం పార్లమెంటుకు ఉందని తెలిపింది. అంతర్జాతీయ ఒప్పందాలకనుగుణంగానే గతంలో భారత ప్రభుత్వం మానవ హక్కులకు సంబంధించి, మనీ లాండరింగ్‌కు సంబంధించి చట్టాల్ని చేసిందని జేపీ బృందం కమిటీ దృష్టికి తీసుకొచ్చింది.

బలమైన అవినీతి నిరోధక చట్టాన్ని తీసుకురావాలని పార్టీలకతీతంగా భావిస్తున్న సెలెక్ట్ కమిటీలోని వివిధ పార్టీల సభ్యులు జేపీ బృందం వాదనల్ని చాలా శ్రద్ధగా ఆలకించారు. ప్రతి అంశాన్నీ లోతుగా అడిగి తెలుసుకున్నారు.

దర్యాప్తు సంస్థలకు స్వతంత్రప్రతిపత్తి కల్పించటంలో ఎటువంటి రాజీ ఉండకూడదని బృందం స్పష్టంచేసింది. సీనియర్ ప్రభుత్వోద్యోగులపై సీబీఐ విచారణకు ముందుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలనే ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంలోని క్లాజ్ 6 ఎను ఖచ్చితంగా తొలగించాలని కోరింది. దర్యాప్తులకు అనుమతులనిచ్చే అధికారం కేంద్రప్రభుత్వానికి కాకుండా కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) మాత్రమే ఉండాలని పేర్కొంది.

ముందస్తు అనుమతిలేకుండా ఒక ప్రభుత్వోద్యోగిని ప్రాసిక్యూట్ చేయటానికి అవినీతి నిరోధక చట్టంలో అవరోధంగా ఉన్న సెక్షన్ 19కి సవరణ చేయాలని కోరింది. ప్రాసిక్యూషన్‌కి అనుమతినిచ్చే అధికారాన్ని ప్రభుత్వం నుంచి తొలగించి లోక్‌పాల్ పరిధిలోకి తేవాలని కోరింది. ప్రభుత్వం తరుపున అభ్యంతరాలేవైనా ఉంటే నిర్ణీత కాలవ్యవధిలో లోక్‌పాల్ పరిశీలించి, ప్రాసిక్యూషన్‌కి అనుమతివ్వాలా, అక్కర్లేదా అనే అంశంపై తుదినిర్ణయాన్నివెలువరిస్తుంది. ఎ.సి.బి, డి.వి.ఎ.సి లాంటి అవినీతి నిరోధక సంస్థలన్నీ లోకాయుక్త పర్యవేక్షణలోకే వస్తాయి అని వివరించింది.

అవినీతి నిరూపితమయ్యే కేసులలో ఆస్తుల జప్తునకు కఠినమైన నిబంధనలు ఉండాలని బృందం కోరింది. 1988లో ఓ విచారణ సందర్భంగా స్మగ్లర్లు, విదేశీమారకద్రవ్యం ఎగవేతదారుల చట్టం, 1976ను పూర్తిగా సమర్థిస్తూ, అవినీతి కేసులలో కూడా అలా ఆస్తులు జప్తుచేసే చట్టపరమైన నిబంధనలు ఉండాలని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని బృందం తెలియచేసింది.

లోక్‌పాల్, లోకాయుక్త బిల్లులోని కొన్ని లొసుగుల్ని, అనవసర జోడింపుల్ని ఎఫ్‌డీఆర్–లోక్‌సత్తా బృందం స్పష్టంగా కమిటీ దృష్టికి తెచ్చింది. ఉదాహరణకు, ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యాలలోని ప్రజావనరుల కేటాయింపు, గుత్తాధిపత్యం అంశాలను లోక్‌పాల్ పరిధిలోకి తేవటంలో విఫలమయ్యారని వివరించింది. అలాగే కాలనీ సంక్షేమ సంఘాల నుంచి మీడియా సంస్థలు, రాజకీయ పార్టీల వరకూ లక్షలాదిసంస్థలను ఈ బిల్లు లోక్‌పాల్ పరిధిలోకి తీసుకొస్తుందని, ఈ నిబంధన వల్ల లోక్‌పాల్ బాధ్యతల నిర్వహణ ఆచరణలో అసాధ్యంగా మారుతుందని, అసంబద్ధమైన విషయాలలో జోక్యం చేసుకుని పౌరుల స్వేచ్ఛకు భంగం కలిగించటం రాజ్యాంగ విరుద్ధం కూడా అని తెలిపింది.

**సెలెక్ట్ కమిటీ ముందు హాజరైన జేపీ బృందంలో డా॥ అశ్విన్ మహేష్ (లోక్‌సత్తా, కర్ణాటక), అంకిత వర్మ (లోక్‌సత్తా, ముంబయి), అనురాగ్ కేజ్రీవాల్ (లోక్‌సత్తా, ఢిల్లీ), సెంథిల్ కుమార్ ఆర్ముగం (లోక్‌సత్తా, తమిళనాడు), సందీప్ వర్మ (లోక్‌సత్తా, ఢిల్లీ), టి. తారా కృష్ణస్వామి (లోక్‌సత్తా, బెంగళూరు) ఉన్నారు.** ■

# అన్నా బృందం రాజకీయ ప్రత్యామ్నాయం

- డి.వి.వి.యస్. వర్మ

రాజకీయంలో అన్నాబృందం రాణిస్తుందా అన్న చర్చ మొదలైంది. ఇది రసవత్తర రూపం ధరించకుండానే పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కావడం, బొగ్గు గనుల కేటాయింపు వివాదం రాజుకోవడం, ఇప్పుడు పదోన్నతులలో రిజర్వేషన్ల సిగపట్లు పర్వంతో అన్నాబృందం మీద చర్చ మరుగునపడింది. అనుదిన పత్రికలు, క్షణక్షణం ప్రత్యక్ష ప్రసార ఛానళ్ల జోరులో వున్న మాధ్యమాలకి కొత్త మేత దొరకగానే పాతకూతల్ని పక్కన పడేస్తున్నాయి. లోక్‌పాల్‌పై అన్నా నిరశన దీక్షలపై ఉధ్రుతలూగించిన ప్రచార మాధ్యమాలు ఆ నిరశనల పరంపరకు జనాకర్షణ తగ్గడంతో సంచలనాలకు బదులు సంశయాలతో సరిపెట్టడం ప్రారంభించాయి.

మనం ఎలాంటి విత్తనాలు వేస్తే అలాంటి ఫలాలే వస్తాయి. అలాగే మనం ఎలాంటి ప్రశ్న వేస్తే అలాంటి చర్చే సాగుతుంది. రాజకీయాలలో అన్నా బృందం రాణిస్తుందా అన్న ప్రశ్న చుట్టూనే చర్చ సాగింది. రాజకీయంలో మరో ప్రత్యామ్నయం మీద చర్చ పక్కదారి పట్టింది. ఇది జయాపజయాల చర్చగా మారింది.

రాజకీయ రంగంలో ప్రవేశించాలన్న అన్నాబృందం ప్రకటన ఆయన బృందంలో, అనుచరుల్లో అభిమానుల్లో కలకలం రేపింది. బృందంలో కొనసాగుతున్న సంతోష్ హెగ్డే, మేధా పట్కర్‌లు దీనికి మద్దతు ఇవ్వలేమని ప్రకటించారు. అభిమానులలో కొందరు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తు నిరసనలు, పోస్టర్లు దగ్ధం లాంటి చర్యలకు దిగారు. అన్నాబృందం స్వయంకృతమే దీనికి కారణంగా కనిపిస్తుంది. ఎందుకంటే వారు అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని రాజకీయ విద్వేష ఉద్యమంగా ప్రారంభించారు. రాజకీయంలో చెడ్డని తుంచడానికి మొత్తం రాజకీయమే చెడ్డదిగా ప్రచారం చేశారు. అందుకే అన్నా మొదటి నిరాహారదీక్ష దరిదాపులకు ఏ రాజకీయనేతనీ దరిచేరనివ్వలేదు. వచ్చినవాళ్లని అవమానించి మరీ సాగనంపారు. పార్లమెంటు మీద, అందులో సభ్యుల మీద వివాదస్పదమైన వ్యాఖ్యలు చేశారు. రాజకీయాన్ని మార్చడానికంటే రాజకీయాన్ని ద్వేషించడానికే ప్రాధాన్యతనిచ్చారు. దాని పర్యవసనంగానే ఇప్పుడు అన్నాబృందం రాజకీయ రంగప్రవేశం చేస్తామనే ప్రకటను చాలామంది జీర్ణించుకోలేకపోయారు.

మరోపక్క అన్నాబృందం సాగిస్తున్న అవినీతి వ్యతిరేక ఉద్యమం రాను రాను ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంగా మారడం ఉప ఎన్నికల్లో వారిని లక్ష్యంగా పెట్టుకుని ప్రచారానికి దిగడంతో ఈ ప్రభుత్వ వ్యతిరేకతని సొమ్ము చేసుకోవాలని జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు అన్నా బృందాల్ని కీర్తిస్తూ తమ మద్దతు ప్రకటించాయి. కాని తీరా అన్నాబృందమే పార్టీని పెడతామని లేదా ప్రత్యామ్నయ అభ్యర్థుల వేదిక సృష్టిస్తామని ప్రకటించగానే సందిగ్ధంలో పడ్డాయి. ఢిల్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని అన్నాబృందం చేసిన ప్రకటనతో బి.జె.పి స్థానికనేతలు మాటల యుద్ధానికి దిగారు. మన రాష్ట్రంలో అన్నాను ఆకాశానికి ఎత్తిన తెదేపా, అన్నా పార్టీ పెట్టడాన్ని తప్పుపట్టింది. అన్నా బృందం పార్టీని ఏర్పాటు చేయటం వారు సాగిస్తున్న అవినీతి వ్యతిరేక ఉద్యమానికి అవరోధం అవుతుందని ప్రకటిస్తున్నా వాస్తవానికి రాజకీయ రంగం తమదీ తమ వారసులదీ తమలాంటి ప్రత్యర్థులదే తప్ప అన్నా బృందం లాంటి వాళ్లది కాదని స్ఫురించేలా ఆ స్పందన కనిపిస్తున్నది.

పైగా అన్నాయే తన ఉద్యమ ప్రారంభంలో అడిగిన ఒక ప్రశ్నకు సమాధానం ఇస్తూ ప్రస్తుత రాజకీయంలో గాంధీజీయే పోటీ చేసినా డిపాజిట్లు దక్కవని ప్రకటించారు. అందుచేత రాజకీయాలలో అన్నా రాణిస్తారా అన్న ప్రశ్నకు మన పత్రికా రచయితలు, విశ్లేషకులు ప్రస్తుత రాజకీయం చుట్టూ, ఎన్నికల వ్యవస్థ చుట్టూ ఈ ప్రశ్నకు సమాధానాన్ని అన్వేషించడం కనిపిస్తున్నది. అందుకే అన్నా బృందం ఈ కుటిల రాజకీయాన్ని ఎదిరించి పోటీ పడగలదా? అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాలకి పదుల కోట్లు డబ్బు గుమ్మరించగలదా? కులం, మతం, చుట్టూ తిరగకుండా గెలుపు సాధించగలదా? అట్టడుగు స్థాయివరకు ప్రజలకు పైరవీకారులుగా, పార్టీలకు కార్యకర్తలుగా పనిచేసే యంత్రాంగం తెచ్చుకోగలరా? ఇప్పుడు

చర్చ అంతా ఇలాంటి వాటి చుట్టూ తిరుగుతున్నది. అంతకు మించిన దూరదృష్టిని మన విశ్లేషణకులు, వ్యాఖ్యాతలు ప్రదర్శించలేకపోతున్నారు.

అసలు ప్రశ్న ప్రస్తుత రాజకీయాన్ని మార్చడానికి అన్నా హజారేల అవసరం లేదా? అని వేసుకుంటే చర్చ దిశ మారుతుంది. మనకి దారి దొరుకుతుంది. దేశంలో సమస్త రంగాలకీ విస్తరించిన అవినీతి మహమ్మారి అందరికీ తెలిసిందే. దానిని కట్టడి చెయ్యడం తక్షణ అవసరంగా అందరూ అంగీకరిస్తారు. అందుకే లోక్‌పాల్ బిల్లు చుట్టూ యువత, మధ్యతరగతి వర్గాలు తమంతట తాము ఉద్యమంలో భాగస్వాములయ్యారు. ఈ ఉద్యమం ద్వారా అన్నా హజారే దేశాన్ని ఒక్క కుదుపు కుదిపారు. దేశసమస్యలకీ, రాజకీయాలకీ దూరంగా వున్న బుద్ధి జీవులను ఆలోచింపజేశారు. కార్యోన్ముఖుల్ని చేశారు. అవినీతి రాజకీయాన్ని బోనులో నిలబెట్టారు. ఒక జాతీయస్థాయి ఉద్యమంగా అది రూపొందింది. ఇటీవల కాలంలో రాష్ట్రాల ఎల్లలు దాటిన దేశవ్యాపిత ఉద్యమం ఇదే కావడం కంటే గొప్ప విజయం మరొకటి లేదు.

ఒక్క లోక్‌పాల్‌తోనే దేశంలో సుపరిపాలన రాదని అందరికీ తెలుసు. దీనివల్ల దొంగల్ని శిక్షించే వ్యవస్థ మాత్రమే ఏర్పడుతుంది. కాని దొంగల్ని సృష్టించే వ్యవస్థని మార్చకపోతే దీని ప్రయోజనం పరిమితం అవుతుంది. అందుకే ప్రస్తుత రాజకీయాన్ని మార్చకుండా సుపరిపాలన సాధ్యం కాదన్న స్పృహ పెరుగుతున్నది. ఇలాంటి మార్పు రాకపోతే ఎన్నికల్లో కోట్లు గుమ్మరించడం తిరిగి అంతకు పదిరెట్లు దండుకునే రాజకీయమే నడుస్తుంది. జనాకర్షణకోసం, ఓటు బ్యాంకుల కోసం రాయితీలు, సబ్సిడీలు, తాయిలాలు పంచడం సుపరిపాలనగా చెలామణి అయిపోతుంది. ఇలాంటి వాటి చుట్టూ ప్రజలు తిరగడం. రాజకీయ పార్టీలు వీటి మీదే పోటీపడడం జరిగిపోతుంది. ఇది సుపరిపాలనా కాదు, ప్రజలకు స్వతంత్ర జీవనాన్ని ఇచ్చేదీకాదు. ఎందుకంటే రాజకీయం కేవలం అధికార క్రీడగా మారినప్పుడు, డబ్బు సంచుల చుట్టూ ఎన్నికల వ్యవస్థ తిరుగుతున్నప్పుడు; ఉత్పన్నమయ్యే పరిస్థితి ఇది. ఇలాంటి చెడ్డ రాజకీయాన్ని ప్రక్షాళన చెయ్యడానికి మంచి రాజకీయమే మందు. అది తప్ప మరో పరిష్కారం రాజకీయాలకు వెలుపల మరొకటి లేదు. అన్నాబృందం రాజకీయప్రవేశం అందుకు అవసరం. రాజకీయానికి దూరంగా వున్న మధ్యతరగతిని, యువతని మంచి రాజకీయానికి ఆకర్షితులు కావడానికి అన్నా రాజకీయ ప్రవేశం ద్వారాలు తెరుస్తుంది. రాజకీయ రంగంలోకి కొత్త శక్తులు, కొత్తరక్తం ప్రవేశానికి మార్గాలు సుగమం అవుతాయి. ప్రస్తుత అవినీతి రాజకీయం మీద పోరాడే నూతన రాజకీయ ప్రత్యామ్నాయ వేదిక ఏర్పడుతుంది.

ఒక కొత్త రాజకీయ ఉద్యమానికి వేదిక నిర్మించడం తేలిక. దానిని విజయపథం వైపు నడిపించడం, అంత తేలిక కాదు. అందుకోసం ముందుగా అవరోధాల మీద అపోహల్ని తొలగించడం, మార్పుకు దోహదం చేసే విధంగా కొత్త ఆకాంక్షల మీద చైతన్యాన్ని కలిగించడం, విశాలమైన వేదికతో ప్రజలలో విశ్వాసాన్ని కల్పించడం జరగాలి.

**కొన్ని అపోహలు :** ఎన్నికల్లో డబ్బు ప్రభావం బలంగా వున్నమాట వాస్తవం. పోటీపడుతున్న పార్టీలన్నీ ఓటర్లకి డబ్బులిస్తున్నారు. ఓటర్లు అందరి దగ్గరా డబ్బులు తీసుకుంటున్నారు. ఉన్న ఒక్క ఓటునీ ఎవరికో ఒకరికి మాత్రమే వేస్తున్నారు. హెచ్చు డబ్బు ఆధారంగానే ప్రజలు ఓట్లు కూడా వెయ్యడం లేదు. డబ్బు కంటే ప్రజల తీర్పు అంతిమంగా గెలుపు ఓటములు నిర్ణయిస్తున్నాయి. ప్రజల్ని ప్రభావితం చెయ్యగల ఎజెండా ముందు డబ్బు ప్రభావం చతికిలబడిన సందర్భాలున్నాయి. ఇది చెయ్యగల శక్తి వుంటే డబ్బుప్రభావం ఎన్నికల ఫలితాల మీద తగ్గిపోతుంది.

అలాగే కులాలు, వర్గాలు ప్రభావాలు కొంత పనిచేస్తున్నాయి. వీటికి అతీతంగా జనజీవనాన్ని మార్చే లక్ష్యాలు పెట్టగలిగితే వాటికి అతీతంగా ఆలోచన పెరుగుతుంది.

అవినీతి ఎన్నికల్లో ప్రజలు అంతగా పట్టించుకోవడం లేదన్నది మరో అంశం. ఎన్నికల తెరమీద పోటీ పడుతున్న ప్రధాన పార్టీలన్నీ ఒకే కోవకు చెందినవి కావడం అవినీతిలో తరతమ బేధాలు తప్ప గుణాత్మకమైన భిన్నత్వం కనిపించకపోవడం, వారిలోనే ఎవరినో ఒకరిని ఎంచుకోవలసిరావడంతో అవినీతి రాజకీయపరంగా విభజన అంశం కాకుండా పోతున్నది.

అవినీతి మీద అన్ని తరగతుల ప్రజలలోనూ తీవ్ర నిరసన వుంది. ఇదే లేకపోతే అన్నా అవినీతి వ్యతిరేక ఉద్యమం

# కొడవటిగంటి రోహిణీ ప్రసాద్‌కు లోక్‌సత్తా నివాళి

ప్రముఖ రచయిత కొడవటిగంటి కుటుంబరావు తనయుడు, బాబా అటమిక్ రీసెర్చి సెంటరీ (బార్క్)లో ఎలక్ట్రానిక్స్ విభాగం శాస్త్రవేత్తగా పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన డాక్టర్ కొడవటిగంటి రోహిణీ ప్రసాద్ (63) ముంబాయిలోని జస్లోక్ ఆస్పత్రిలో సెప్టెంబర్ 8న ఆయన అంతిమశ్వాస విడిచారు. చాలా కాలంగా మధుమేహంతో బాధపడుతున్నారు. 1949 సెప్టెంబరు 14న జన్మించారు. రోహిణీ ప్రసాద్‌కు భార్య లలిత, కుమారుడు కార్తీక్, కుమార్తె యామిని ఉన్నారు.



రోహిణీ ప్రసాద్ అటామిక్ రేడియేషన్ డిటెక్షన్ రంగంలో నిపుణుడిగా గుర్తింపు పొందారు. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన తర్వాత అమెరికా వెళ్లి రేడియేషన్ మానిటరింగ్ రంగంలో పనిచేశారు. అనంతరం భారత్‌కు తిరిగి వచ్చి హైదరాబాద్‌లోని ఈసీఐఎల్ కన్సల్టెంటుగా వ్యవహరించారు. చిన్నతనం నుంచి సాహితీ, సంగీత రంగాలలో అసామాన్య ప్రజ్ఞాపాటవాలు కనబరుస్తూ నిష్ణాతుడిగా గుర్తింపు పొందారు. వైజ్ఞానిక అంశాలకు సంబంధించి తెలుగు, ఇంగ్లీషులో పలు వ్యాసాలు రాశారు. అటమిక్ ఎనర్జీ, నాడీ వ్యవస్థ, జనరేషన్ ఎవల్యూషన్ తదితరాలపై ఎనిమిది పుస్తకాలు వెలువరించారు. హిందూస్తానీ, కర్ణాటక సంగీతాలలో ఆయన అద్భుత ప్రావీణ్యం సాధించారు. సితార విద్యాంసుడిగా గుర్తింపు పొందారు. ముంబయిలో పలు సంగీత కార్యక్రమాలు నిర్వహించి వర్ధమాన కళాకారులకు చేయూతను ఇచ్చారు. ముంబాయిలోని ఆంధ్ర మహాసభ, తెలుగు సాహితీ సమితి తదితర ఎన్నో సంఘాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

## లోక్‌సత్తా నివాళి

పలు రంగాలలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించిన రోహిణి ప్రసాద్‌కు లోక్‌సత్తా పార్టీ నివాళులర్పించింది. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది.

ఒక్కసారి దేశవ్యాపిత ఉద్యమం అయ్యేదికాదు. అందుచేత సంప్రదాయ పార్టీలకు భిన్నమైన రీతిలో నూతన రాజకీయ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా కొత్త ప్రత్యామ్నాయం ఎన్నికల బరిలో దిగితే అవినీతి వ్యతిరేక ప్రభావం ఎన్నికల్లో కనిపిస్తుంది.

**కొత్త ఆకాంక్షలు :** ప్రస్తుత రాజకీయం ప్రజల ఆలోచనల్ని కేవలం రాయితీలు, తాయిలాల చుట్టూ తిప్పుతున్నది. కొన్ని రాయితీలు అవసరమే కాని దాని చుట్టూ తిరిగితే కొత్త జీవనం రాదు. అందరికీ ఎదిగే అవకాశాల కోసం, స్వతంత్ర జీవనం కోసం ప్రజల ఆకాంక్షల్ని పెంచే ప్రత్యామ్నాయాన్ని ప్రజల ముందుంచాలి. దానిని అందుకోడానికి మార్పు అవసరం అన్న భావనని పెంపొందించాలి. తమ జీవనం మారుతుందను కుంటేనే ప్రత్యామ్నాయానికి ఆదరణ పెరుగుతుంది.

**విశాలవేదిక :** దేశంలో అవినీతి వ్యతిరేక ఉద్యమానికి అన్నా హజారే కేంద్రబిందువుగా వున్నారు. కాని వివిధ రాష్ట్రాలలో ఇలాంటి బృందాలు, వేదికలు, పార్టీలు ఏర్పడి వున్నాయి. కొత్త వేదికలు ఏర్పడే సూచనలు, ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. అవినీతి రహిత రాజకీయం కోసం, సుపరిపాలన కోసం కృషి చేసే వ్యక్తులు, వేదికలు, ఒకే గొడుగుకిందకు రావడం అవసరం. అప్పుడే అది ఒక విశాల వేదికగా ప్రజలకు, విశ్వాసాన్ని కల్పిస్తుంది.

ఇవన్నీ జరిగితే అది ప్రజాఉద్యమ వేదికగా, ప్రత్యామ్నాయ రాజకీయాన్ని ఇచ్చే వేదికగా రూపొందడానికి వీలుపడుతుంది. ఇలాంటి ప్రయత్నం అన్నా బృందం ప్రారంభించాలి. వారు గతంలో సాగించిన ఉద్యమంలో అనేక లోటుపాట్లు, ఒంటెత్తు పోకడలు, దుందుడుకు ప్రవర్తన, అవగాహనారాహిత్యాలు ప్రస్ఫుటంగా కనిపించాయి. ఇప్పటికైనా అన్నాబృందం కొత్త రాజకీయ ప్రత్యామ్నాయానికి తగిన పరిణతిని ప్రదర్శిస్తే దేశానికి ఎంతో మేలు జరుగుతుంది. ■

# విద్యను మించి మతం లేదు

**-డా॥ జయప్రకాష్ నారాయణ్**

*ఆధునిక భారతదేశ చరిత్రలోనే విశిష్ట సామాజిక పరివర్తనకారుడు నారాయణ గురు 158వ జన్మదినోత్సవం సందర్భంగా ఆగస్టు 31, 201న గురుధర్మ ప్రచారణ సభ, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో శ్రీ నారాయణ విద్యాభవన్, గ్రీన్‌ఫీల్డ్స్, కానాజిగూడ, తిరుమలగిరి, సికింద్రాబాద్‌లో జరిగిన సర్వమత సమ్మేళన సభలో గౌరవ అతిథిగా పాల్గొన్న లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇచ్చిన ప్రసంగ స్థూలపాఠం 'లోక్‌సత్తా టైమ్స్' పాఠకుల కోసం...*





మానవత మూర్తీభవించిన మహామనిషి నారాయణ గురు. ఆయన 158వ జన్మదినోత్సవం సందర్భంగా మనందరి తరుపున, మొత్తం భరతజాతి తరుపున నివాళులర్పిస్తున్నాను, అంజలి ఘటిస్తున్నాను.

భారతీయ సమాజాన్ని అసమానతలు, కులతత్వం, అస్పృశ్యత, వివక్ష పట్టిపీడిస్తున్నాయని వేల ఏళ్లక్రితమే గుర్తించారు. ప్రధానంగా వివక్షను తొలగించేందుకు, ఒకరకంగా కులతత్వాన్ని నిర్మూలించేందుకు గౌతమ బుద్ధుడు, మహావీర జైనుడు ఎంతో పోరాటం చేశారు. ఆధునిక యుగంలో ఐదుగురు మహనీయులు ఉన్నారు. మహాత్మాజోతిబా పూలే 1827లో పెట్టి 1890లో మరణించారు. ఒకరకంగా ఆధునిక భారతీయ సమాజంలో ఈ అసమానతల తొలగింపు కోసం సైద్ధాంతిక పునాది ఏర్పరిచిన వ్యక్తి ఆయన. బాపూజీ 1869లో పెట్టి 1948లో తుపాకీగుళ్లకి బలయ్యారు. కులనిర్మూలన కోసం ఆయన పోరాడలా. కానీ అస్పృశ్యత పోవాలని పోరాడారు. జీవితమంతా పోరాడారు. నమ్మిందే చెప్పి, ఆచరించి చూపారు. గాంధీగారు పుట్టిన పదేళ్లకు 1879లో రామస్వామి నాయకర్ పుట్టారు. ఆయన దేవుడు లేడు, విగ్రహాలు వృధా అని మొత్తాన్నీ తిరస్కరించి కులవ్యవస్థ నిర్మూలించటం కోసం రాజీలేని పోరాటం చేసి 1973లో చనిపోయారు. బాబాసాహెబ్ అంబేద్కర్ 1891లో పుట్టి, కేవలం మతాన్ని సంస్కరించటం చాలదు, రాజ్యాన్ని సంస్కరించాలి అనే లక్ష్యంతో ఒక బలమైన, మతాతీతమైన రాజ్యవ్యవస్థకు పునాది వేసి వివక్షలేని సమాజం సృష్టి కోసం ఒక రాజకీయ సిద్ధాంతాన్ని అందించారు. 1956లో అంబేద్కర్ మరణించారు. ఆయన పోయిన ఏడాదే నేను పుట్టింది. కానీ వాళ్లెవరూ సాధించలేని నిజమైన విజయం కేవలం పూజ్య నారాయణ గురు సాధించారు.

అందుకే భారతీయ చరిత్రలో మనమంతా గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి నారాయణ గురు. మిగతావాళ్లు ఆయనకి ఏమాత్రం తగ్గకుండా చాలా ఉదాత్తమైన ఆశయాల్ని, ఆలోచనలను, ఆర్తిని, జీవితంలో పోరాటాన్ని, త్యాగాన్ని చూపారనటంలో సందేహం లేదు. కానీ కేవలం నారాయణ గురు మాత్రమే ఆయన చుట్టూ ఉన్న సమాజంలో తన జీవితకాలంలో సంపూర్ణంగా మార్పు తేగలిగారు. ఈదేశంలో ఆ అదృష్టం ఆ కాలంలో నారాయణ గురుకి, ఇటీవలికాలంలో కొంతమేర పాండురంగ శాస్త్రి అథోల్ (స్వాధ్యాయ ఉద్యమం)కే దక్కింది. పాండురంగ శాస్త్రి అథోల్ కొంకణ, గుజరాత్ తీరప్రాంతంలో కొన్నివేల గ్రామాలలో మౌలికమార్పులకు కోసం కృషి చేసి విజయం సాధించారు. కానీ నారాయణ గురు సాధించిన స్థాయిలో విజయం కాదది. నారాయణ గురు ఒక రాష్ట్రాన్ని, ఒక పెద్దసమాజాన్ని ప్రభావితం చేశారు.

ఎందుకని కేవలం నారాయణ గురుకి మాత్రమే అంత విజయం సాధ్యమైంది? భారతీయ సమాజంలో మౌలికమార్పులు తేవాలన్న కోరిక, తపన మనకు బలంగా ఉంటే బహుశా నారాయణ గురు జీవితం నుంచి, ఆయన బోధనలు, ఆయన ఆచరణ నుంచి ఎంతో నేర్చుకోవచ్చు.

నారాయణ గురులో ఉన్న అసాధారణ విషయం...ద్వేషాన్ని పూర్తిగా జయించటం! ఒక వికృతమైన సమాజంలో వివక్షకు గురై, నిరాదరణకు గురై, గుండెల్లో ఎంత కోత, బాధ ఉన్నా ద్వేషాన్ని పూర్తిగా జయించి ఆయన ప్రేమను పంచగలిగారు. ఒక ఉద్యమం దీర్ఘకాలికంగా మనగలగాలి అంటే, ఒక జాతి మొత్తాన్నీ ప్రభావితం చేయాలి అంటే, సమాజం మొత్తాన్నీ మార్చాలి అంటే మొట్టమొదట ఖచ్చితంగా ద్వేషాన్ని జయించవలసిందే, ప్రేమను పంచవలసిందే. అది లేకుంటే ఎంత బలమైన భావనలైనా కూడా ఆ మనిషి ఉన్నంతకాలం, ఆ మనిషి నడుస్తున్నంత కాలం, ఆ చుట్టూ మనకు కొంత స్ఫూర్తినిస్తుంటాయిగానీ అవి తరతరాలుగా మన జీవితాల్ని ప్రభావితం చేయలేవు, జాతిని మార్చలేవు.

ఇంకోటి, మతాన్ని నారాయణ గురు ఆధునికీకరించారు. హి సెక్యులరైజ్డ్ ది రెలీజియన్. అదో అసాధారణ ప్రయోగం. ఆయన మతాన్ని మనిషి నుంచి దూరంగా తీసుకుపోలేదు. మనిషి చుట్టూ తిప్పారు. ఆయన భాషంతా, మన మతం ఏదైనా, మనకు మతమే లేకున్నా, మనం దేవుడ్ని నమ్మినా, నమ్మకపోయినా మనందరం హాయిగా మాట్లాడుకునేలా ఉంది. ఆయన మాటలు ఏ సంకోచం లేకుండా వాడగలిగిన భాష. ఆయన వాక్యాల్ని మళ్లీమళ్లీ చదివా. ఎక్కడైనా వాడటానికి సిగ్గుపడాల్సి వస్తుందా అని పరిశీలించా. ఈ సమాజంలోనేకాదు, అమెరికా, ఆఫ్రికా, మధ్యప్రాచ్యం, లాటిన్ అమెరికా ఇలా ప్రపంచంలో ఏ మూలైనా ఆ భాషను వాడటానికి మానవతవున్న ఏ మనిషికీ సిగ్గుపడాల్సిన అవసరం లేదు. సంకోచం అక్కర్లేదు. అంతగా మతాన్ని నారాయణ గురు ఆధునికీకరించారు.

పెద్దలు, విజ్ఞులు అయిన మతాచార్యులు ఉన్నారు. కానీ శతాబ్దాలకాలంగా మతాలు ఛాందసవాదాన్ని పెంచిపోషించాయి. ఇటీవల కొంతమేర మతాలు మనుషుల్లో ఆలోచనను పెంచే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ ఫలానా కులస్తులు, మహిళలు జ్ఞానబోధల్ని వింటే వారి చెవుల్లో సీసం పోశారు. బైబిల్ విషయంలో కూడా అలానే జరిగింది. అందుకే మార్టిన్ లూథర్‌కింగ్ రావలసి వచ్చింది. మతాలు కొంతమంది మతాచార్యుల సొత్తులుగా, కేవలం వారి ఆదేశాలను పాటించే భీరువులుగా, సామాన్యులుగా ప్రజలు ఉన్నారు. అందుకు పూర్తి భిన్నంగా నారాయణ గురు తొలినుంచి విద్య, విద్య, విద్య అని ఎలుగెత్తి చాటారు. విద్య నుంచి స్వేచ్ఛ, విద్య ద్వారా స్వేచ్ఛ అని నిరంతరం చెప్పారు. జ్ఞానాన్ని పెంచకుండా భక్తుల్ని తయారుచేస్తే అది రిచ్యువల్ అవుతుంది తప్ప ధర్మం కాదని చెప్పారు.

ఈ మూడు కోణాల్ని ఆయన ధార్మికచింతనతో కలపటం వల్లే కేరళ సమాజాన్ని, ఈళవ కులస్తుల్ని అస్పృశ్యత నుంచి ఒకతరం కాలంలో బైటికి తీసుకొచ్చి ఆత్మస్థయిర్యాన్ని, ఆత్మగౌరవాన్ని పెంచి విద్యను అందించారు. దేశచరిత్రలో నారాయణ గురు ద్వారా తప్ప మరెక్కడా ఇలాంటి గొప్ప విజయం సాధ్యం కాలేదు. అది కేవలం ఈళవ కులస్తులకే పరిమితంకాలేదు. కేరళ సమాజం మొత్తాన్నీ మార్చింది. ఇప్పటికి కూడా కేరళ గురించి మాట్లాడగానే దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే అక్కడ వైశిష్ట్యం ఉందని ఎందుకు భావిస్తున్నాం అంటే, అక్కడి విద్య, ఆరోగ్యం, ఆలోచన మానవ విలువలు, మానవ హక్కులు, ప్రజాస్వామిక దృక్పథాలు గురించి ఎందుకు మాట్లాడుకుంటున్నాం అంటే కొందరు చెబుతున్నట్టు ఈ పార్టీ, ఆ పార్టీ కారణం కాదు. అది కేవలం నారాయణ గురు జీవితం, ఆయన చేపట్టిన కార్యక్రమాలు, ఆయన ప్రభావితం చేసిన సమాజం వల్లే సాధ్యమైంది. అందుకే కేవలం మొక్కుబడిగా

పెదవుల మీద నుంచి కాకుండా గుండె లోతుల్లో నుంచి మీ అందరి తరుపునా నారాయణ గురుకి అంజలి ఘటిస్తున్నాను.

చాలా క్లుప్తంగా నాలుగు అంశాలు.

మతాచార్యులు, పెద్దలు దయచేసి ఆలోచన చేయాలి. ఇప్పుడు కూడా మతం ప్రభావం కోట్లాదిమంది మీద ఉంది. ఆ మతం ప్రభావాన్ని మంచి మార్గం కోసం వినియోగించకపోతే కోట్లాదిమంది నష్టపోతారు.

మొట్టమొదటిది, విద్య. నారాయణ గురు జీవితమంతా పరితపించింది అందుకే. నాకు నిజంగా దేవుడున్నాడో లేదో తెలియదు. దాని గురించి ఆలోచన కూడా చేయను. గౌతమ బుద్ధుడు చెప్పినట్టుగా దేవున్నాడో లేదో తెలియదు, మనిషి ఉన్నాడు, అనవసర కష్టాలున్నాయి, అంతకుమించి దేవుడు అనవసరం. దేవుడున్నా నన్ను గురించి పట్టించుకునేదాకా దేవుడి గురించి పట్టించుకోకూడదని నిర్ణయించుకున్నాను. మ్యూచ్యువల్ నాన్ఇంటర్ఫియరెన్స్. కానీ పాపం ఉందని నేను పూర్తిగా నమ్ముతాను. దేవుడున్నా లేకున్నా ఖచ్చితంగా పాపం ఉన్నది. ప్రపంచంలో అతిపెద్ద పాపం–అన్ఫుల్ఫిల్డ్ పొటెన్షియల్. ఒక బిడ్డకు ప్రకృతి ప్రసాదించిన ప్రతిభాపాటవాలుంటే, వాటిని బైటికితీసే ప్రయత్నాన్ని సమాజం చేయకపోతే, కేవలం ఫలానా తల్లిగర్భంలో పుట్టిన కారణంగా నా జీవితం ఇట్లా అయిపోయిందని కన్నీళ్లు కార్చే పరిస్థితి ఉంటే ఒక సమాజంగా మనమంతా పాపం చేస్తున్నట్టు లెక్క.

ఆ తర్వాతది, నివారించదగ్గ కష్టం. నివారించలేనివాటికి మనం ఏమీ చేయలేం. కానీ రోడ్డు మీదప్రమాదాలలో నష్టపోవటం, టీకాలు అందకపోవటం వల్లో అంగవైకల్యం, రోగాలబారిన పడటం వంటివి జరుగుతుంటే అంతకంటే పాపం ఇంకోటి లేదు. ఈవేళ ఈ రెండు పాపాలూ భరతజాతిని దహించివేస్తున్నాయి. ఇక్కడ స్కూలులో ఉన్న సుమారు 700మంది పిల్లలకు కులమతాలకు అతీతంగా మంచి భవిష్యత్తునిచ్చే చదువును అందించే ప్రయత్నం చేస్తున్నారు. సంతోషం. కానీ ఇదే గడ్డ మీద, ఇదే హైదరాబాద్లో అసంఖ్యాక బిడ్డలకి ఎందుకని మంచి చదువు అందటం లేదు? ఈవేళ లక్షలమంది రెక్కాడితేగానీ డొక్కాడనివారు, రోజు కూలీలు తమ శక్తికి మించి పిల్లల చదువుకు ఖర్చు చేస్తున్నారు. మరోపక్క ప్రభుత్వం రకరకాల పథకాల పేరుతో వేలకోట్లు ఖర్చుచేస్తున్నట్టు ప్రకటిస్తోంది. కానీ నిజాయతీగా, గుండెమీద చేయి వేసుకుని చూస్తే, నూటికి 80మందికి మనదేశంలో సరైన చదువు అందటం లేదు. వారి శక్తిసామర్థ్యాలు బైటపడటం లేదు. ఇది కఠోర వాస్తవం. ప్రైవేటు, ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యతా ప్రమాణాలు అలా ఉన్నాయి. ఇటీవలే ప్రపంచవ్యాప్తంగా 64 దేశాల మధ్య 74 ఎంటిటీలలో చదువుల తీరుపై, చదవటం, రాయటం, అంకగణితం వంటి చిన్నచిన్న అంశాలపై ఆ దేశాల భాషలలోనే పరీక్ష పెట్టారు. భారతదేశం అట్టడుగు నుంచి రెండవ స్థానంలో ఉంది. మనకంటే దిక్కుమాలిన కజిగిస్థాన్ అనే దేశం లేకపోతే మనం అట్టడుగున ఉండేవాళ్లం. ఈదేశంలో అద్భుతమైన విద్య ఉంది, అపారమైన శాస్త్రవిజ్ఞానం గల లక్షలాది మంది ఉన్నారనటం అబద్ధాలాడటం, మనల్ని మనం మోసం చేసుకోవటమే. నూటికి పదిమందికో, పదిహేనుమందికో కాస్త విద్య అందితే అది విద్య కాదు. నూటికి 80మందికి వారి శక్తిసామర్థ్యాలు, ప్రతిభాపాటవాలు వెలికిరావటంలా. వారందరి సామర్థ్యం పూర్తిస్థాయిలో వికసించేలా సరైన చదువును అందించటం ద్వారా మాత్రమే నారాయణ గురుకి నివాళిని అందించే అర్హతను మనం పొందగలం.

దయచేసి మతాచార్యులు, ఏమతానికి ఆ మతంలో, ప్రతి కుటుంబం గుండెలలో ఈ మాటల్ని ప్రవేశపెట్టండి. రాజకీయంలో ఉన్నవారిని, అధికారులను ఈ విషయంలో నిలదీయండి. దేశాన్ని దోచేవారు, లంచాలు మింగేవారు, హత్యలు చేసేవారు కూడా మీ కాళ్లు పట్టుకోవటానికి మీ దగ్గరకు వస్తున్నారు. వాళ్లందరికీ కాస్తంత గడ్డి పెట్టండి, కాస్తంత బుద్ధి పెట్టండి. అరేయ్, నీకేమన్నా బుద్ధి ఉంటే ఒక అధికారి కాగానే, ఒక నాయకుడు కాగానే ప్రతి బిడ్డకూ చదువు అందించే ఏర్పాటు చేసి నా దగ్గరికి రా. అప్పుడు దేవుడు నిన్ను క్షమిస్తాడు. లేకుంటే నిన్ను క్షమించడు అని నిర్మొహమాటంగా చెప్పండి. మతానికి అర్థం మార్చండి. కేవలం ఫలానా తల్లి గర్భాన పుట్టిన కారణంగా ఈ దేశంలో పుట్టిన బిడ్డకి సరైన చదువు అందే అవకాశం లేదంటే, ఏ దేవుడ్ని గురించి మాట్లాడతాం మనం? ఏ మతం గురించి మాట్లాడతాం? ఎవరి తప్పు ఇది? మతం అంటే విద్యను మించి, విద్యకు అతీతమైనదని భావిస్తే మీరు పాపం చేస్తున్నారని బహిరంగంగానే చెబుతున్నాను. దయచేసి ఈ సమాజానికి ఈ మాట చెప్పండి. ఈ బుద్ధి తీసుకురండి. కేవలం కొంతమంది పిల్లలు చదివితే చాలదు, ప్రతి బిడ్డ సామర్థ్యం బైటపడాలి.

రెండోది, నారాయణ గురు జీవితమంతా వివక్షలేకుండా

ప్రతి బిడ్డా ఎదిగేలా చేసేందుకు పాటుపడ్డారు. ఈవేళ మనం చేస్తున్నదేమిటి? ఈశాన్యభారతంలో ముస్లింలన్న కారణంగా బంగ్లాదేశ్ నుంచి వచ్చారన్న ఆరోపణలతో ఊచకోత కోయటానికి ప్రయత్నిస్తున్నాం. వాళ్లు బంగ్లాదేశ్ నుంచి చొరబడినవారు కారు. వారిలో 90శాతంమంది ఎప్పుడో 1920లలో అప్పటి బెంగాల్ నుంచి వచ్చినవాళ్లు. అక్కడ తేయాకు తోటలలో పనికి మనుషులు కావాలంటే వచ్చినవాళ్లు. పోనీ బంగ్లాదేశ్ నుంచే వచ్చారని అనుకుందాం. పొట్టకూటి కోసం కష్టపడి పనిచేయటం కోసం, చాలా కృత్రిమంగా ఏర్పాటుచేసిన సరిహద్దుల్ని దాటి వస్తే నిన్న మొన్నటిదాకా మన బిడ్డల్ని, మన అన్నదమ్ముల్ని ఈవేళ ఊచకోత కోస్తామా? సరే, అక్కడ తప్పు జరిగింది. భారతదేశంలోని మిగిలిన చోట్ల హైదరాబాద్, బెంగళూరు, కోచి వంటి చోట్ల నుంచి వాళ్లు బిక్కుబిక్కుమంటూ రైళ్లలో టికెట్లు కూడా లేకుండా పశువుల్లా కిక్కిరిసిన రైళ్లలో పారిపోయే పరిస్థితి కల్పిస్తామా?... ఎక్కడ దేశం? ఎక్కడ సమాజం? ఎక్కడ మతం? ప్రపంచంలోని ఎల్లలు తొలగిపోవాలి మొర్రో అని ఒకపక్కన అంటుంటే, ఈదేశంలోనే ఈ మతం, ఈ భాష, ఈ ప్రాంతం అంటూ అక్కడ్నుంచి ఇక్కడికొస్తే నేనూరుకోను, ఇక్కడ్నుంచి ఎక్కడికైనా వెళ్తే భయపడుతూ బతుకుతాను అనే వాతావరణాన్ని సృష్టిస్తే ఇంక మతమేంటి? భయాన్ని తొలగించి, స్వేచ్ఛగా ఎక్కడైనా తలెత్తుకుని బతికే ధైర్యాన్ని ఇవ్వకపోతే ఆ విద్య ఎందుకు? ఎందుకీ మతం? ఎందుకీ విద్య? మతాచార్యులు ఈ విషయాల గురించి మాట్లాడతారని చాలా ఆశించాను. ఎప్పుడైనా మాట్లాడితే, నా మతంలోని వారికి ఏదైనా జరిగిందని మాట్లాడినవాళ్లే తప్ప నా దేశంలోని పౌరులకు జరిగిందని మాట్లాడిన వాళ్లు లేరు. వేరే మతంవారికి నష్టం జరిగితే ఫర్వాలేదా? ఎంత సంకుచితం చేసుకుంటున్నాం ఈ సమాజాన్ని? ఇది పిల్లలకు, పెద్దలకు అర్థం కావాలి– దక్షిణాసియాలో ఎక్కడ, ఏ కులంలో, ఏ మతంలో పుట్టినా వాళ్లంతా కూడా మన మనుషులే అని గుర్తించకపోతే, వాళ్లందరి ఆర్థికాభివృద్ధి మనందరి ఉమ్మడి అవసరం అని గుర్తించకపోతే, వాళ్లు ఎక్కడున్నా వాళ్లకు హక్కులున్నాయి అని గుర్తించి గౌరవించకపోతే ఈ దేశానికి, జాతీయతకి, మన సంస్కృతీసంప్రదాయాలకి, మతానికి అర్థం లేదు. నారాయణ గురు తన కాలంలో పరిస్థితులకనుగుణంగా అస్పృశ్యత మీద పోరాడాడు. కానీ ఈవేళ కులం,మతం,భాష,ప్రాంతం పేరుతో విద్వేషాలను పెంచుతుంటే, రాజకీయం దానిని ఓటుబ్యాంకులుగా మలుచుకుంటుంటే, ప్రజలలో చిచ్చుపెట్టటమే రాజకీయ చతురత అవుతుంటే ఎందుకని మతాచార్యులు గొంతువిప్పటం లేదు?

మూడోది, ప్రతి మతం చెప్పేది మనిషిలో కాస్తంత నమ్రతను పెంచుకోవాలని. మనిషికున్న వనరుల్ని, శక్తిని పదిమంది మంచికోసం ఉపయోగించాలని. ఒక్కసారి హైదరాబాద్ నగరంలో పెళ్లిళ్లు చూడండి మతాచార్యులూ. ఎంతెంత ఖర్చు పెడుతున్నారో చూశారా? సామాన్య ప్రజల్ని అవమానిస్తున్నారే, మనకి జీవితం మొత్తంలో వనరుల్ని కలిపినా కూడా వాడి పెళ్లి ఖర్చు ముందు మనం తూగమే?! ఆ రకంగా అంగరంగ వైభవంగా పెళ్లిళ్లకు ఖర్చు పెట్టి, దుబారా ఖర్చు చేసి, వాళ్ల అహంకారాన్ని చూపెట్టి మనల్ని అవమానిస్తున్నారే, కించపరుస్తున్నారే?! జాతివనరుల్ని వృధా చేస్తున్నారే?! ఈ వృధాని అరికట్టాలి. మనిషి సంపాదించటం తప్పుకాదు. సమాజంలో నీతివంతంగా, ప్రజలకు సేవలందించి సంపాదిస్తే అది మంచిదే. నిజమైన సంపద సృష్టి చాలా పవిత్రమైన కార్యక్రమం. కానీ దోచుకున్న డబ్బును ఆడంబరంగా ఖర్చుపెట్టి ఆ రూపంలో తమ ప్రభను పెంచుకునే ప్రయత్నం చేస్తే, సమాజాన్ని కర్కశంగా అపహాస్యం చేస్తుంటే, ఏదోకరకంగా కోట్లు సంపాదిస్తేనే గొప్పవాళ్లం, ధర్మానికి, న్యాయానికి నిలబడితే నేను ఎందుకూ పనికిరాని వాడ్ని అనే భావాల్ని చిన్నారుల మనసులలో నాటుతుంటే ఏం మతం? ఏం కులం? ఏం సమాజం? నాకీ పెళ్లిళ్లకు వెళ్లాలంటే గుండెలవిసిపోతున్నాయి. ఈ సమాజంలో ఉంటూ ఈ మాటలు చెబితే పిచ్చివాళ్లు అంటారని మౌనం వహించి ఇంట్లో కూర్చోవాల్సి వస్తోంది. మతాచార్యులూ! ఆదర్శవంతమైన, నిరాడంబరమైన జీవితాల్ని సమాజానికి అందించే ప్రయత్నం చేయండి. ఈ సమాజంలో అందరికీ చెప్పండి. మీరు సరైన మార్గంలో ఎంతైనా డబ్బు సంపాదించండిగానీ నిరాడంబరంగా బతకండయ్యా, వృధా ఖర్చు అరికట్టటండయ్యా, ఇతరులను అవమానించేట్టు కాకుండా సమాజానికి మేలుచేసేట్టు మీ డబ్బుకు ధర్మకర్తలా వ్యవహరించండయ్యా అని చాటిచెప్పండి. అప్పుడే మతం గురించి మాట్లాడే అర్హత వాళ్లందరికీ ఉంటుందిగానీ, మతం పేరు చెప్పి మతాచార్యుల వద్దకు వస్తే వారిని గౌరవించటం చాలా హీనసంస్కృతి. తప్పనిసరి పరిస్థితి కాబట్టే ఈవేళ చాలా పరుషంగా మాట్లాడాల్సి వస్తోంది.

**తరువాయి 32వ పేజీలో...**

# అడుగుజాడ గురజాడది

- ఆర్వీయార్

"అడుగు గురజాడది అది భావికి బాట మనలో వెధవాయిత్వం మరిపించే పాట" అని శ్రీశ్రీ గురజాడను కీర్తించేడు. యిందులో అతిశయోక్తి గాని మెరమెచ్చు గాని యేమాత్రం లేదు. గురజాడ అడుగుజాడ యెలాంటిది? అది భావికి నడిపించే బాట యెలా అయింది? ఆయన ప్రభావం అంత గాఢంగా పడడానికి తగ్గ కృషి గురజాడ యేం చేశాడు? యీ అంశం బోధపడాలంటే ఆనాటి సాంఘిక రాజకీయ పరిస్థితులు అవగతం కావాలి. పరాయిపాలనలో దేశం మగ్గుతోంది. రాజకీయంగా ప్రజలకు యే హక్కులూ లేవు. సాంఘికంగా పరిస్థితి దుర్భరంగా వుంది. కరువు కాటకాలు వార్షికం అయేయి. భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ శిథిలమైంది. బ్రిటీష్ పాలసీ పద్ధతుల వల్ల భారతజాతి ప్రత్యేకత పోయింది. తనకి ఆధారభూతమైన మూలాలు యేమిటో జాతి వెతుక్కుంటోంది. సాంఘికంగా అవిద్య, మూఢనమ్మకాలు, ముందు సాగనీయకుండా అడ్డంపడే మకిలి ఆచారాలు జాతి జీవితాన్ని నీరసింప చేశాయి. యిదీ 19వ శతాబ్దం నాటి పరిస్థితి. చరిత్ర చూస్తే మహోజ్జ్వలంగా వుంది. వర్తమానం చూస్తే వల్లకాటిలా వుంది. ఆ నేపథ్యంలో భారతజాతి పునర్వికాసం జరిగింది. రాజారామ మోహనరాయ్ పథ నిర్దేశకుడయేడు. సాంఘిక సంస్కరణలకీ ఆధునిక విజ్ఞానవ్యాప్తికీ నడుం కట్టేడు. ఇంగ్లీష్ మాధ్యమంలో బోధన వుండాలన్నాడు. అదే ఓ రకంగా కూపఖానక న్యాయం అయింది, అంటే నూతిని తవ్వినవాడు ఆ నీటితోనే తన వొంటి మట్టిని కడుక్కున్నట్టు అయింది.



**గురజాడ**
**150వ జయంతి**
**సెప్టెంబర్ 21**

ఇంగ్లీషు చదువుల వల్ల ఒక నూతన వికాసం కలిగింది. చైతన్యం కలిగింది. ఇంగ్లీషు వాళ్ళ పాలనను ఎదిరించి స్వాతంత్ర్యం కోసం పోరాటం సాగించే ఒక చైతన్యం, మానసిక స్థైర్యం క్రమేపీ రూపు తీసుకోవడానికి ఇంగ్లీషు చదువులే హేతువులయేయి. కొత్తరీతి చదువుల వల్ల జాతి నిద్ర లేచింది. తనేమిటో గుర్తు చేసుకుంది. తన ఉనికి గమనించింది. ఒళ్లు విదిలించి ముందుకు సాగడానికి పథం రెండు విధాలుగా ఏర్పడింది. ఒకటి తన్ని తాను సంస్కరించుకోవడం అది మొదటిది. మరొకటి రాజకీయంగా మెరుగుపరచుకోవడం. యిది రెండవది. మొదటిది సంస్కర్తల కర్తవ్యం అయింది..... ముందు పునర్వికాస యుగం గురించి చూద్దాం. ఆ దశలో పత్రికలు పుట్టుకొచ్చేయి. వాటితో బాటు గ్రాంథిక భాషా నిరసన, వ్యావహారిక భాషోద్యమంగా తరంగించింది. ఆ పునరుజ్జీవన చైతన్యం సకల జీవిత పార్శ్వాలనీ దీప్తం చేసింది. ఆ చైతన్యాన్ని మరింత తేజోవంతం చేసే ప్రభావం కలిగించినవాడు గురజాడ. ఆయన రూపంలో ఆనాటి చైతన్యం ప్రతిబింబించింది. ఆయన నవ్యుడు, ఆధునికుడు. గురజాడలో కనిపించే నవ్యత, ఆధునికత యెలాంటివి? పాతదాంట్లో కనిపించే తూట్లకు మాటు వెయ్యడమే కాదు ఆ నవ్యతారీతి. చిరుగులకు చిన్న చిన్న పీలికలు అతికి కుట్టడమే కాదు ఆ ఆధునికత. మొత్తం జీవితాన్ని దర్శించే తీరు. దాన్ని సమూలమైన మార్పులతో ఎదిరించే తీరు ఆధునికత, నవ్యత.....ఆధునికత అనే పదాలని కాలవాచిగా ప్రయోగించడం వుంది. నవ్యత ఆ అర్థంలో తృప్తి పడవచ్చునేమో

గాని ఆధునికత అలా గాదు. యీ పదం ఒట్టి కాల నిర్దేశకమైందే కాదు, స్వభావం సూచకం అని కూడా చెప్పాలి. కాలరీత్యా మొన్నటి కంటే నిన్న, నిన్న కంటే యివాళ ఆధునికం కావచ్చు. కాని స్వభావ రీత్యా చూసినప్పుడు యివాళ వున్న వాటిలో అనేకం ఆధునికం కాకపోవచ్చు. యివాళ సంప్రదాయాన్ని నిలబెట్టాలని చూసే వాళ్ళున్నారు. కాలం రీత్యా వాళ్లు యివాళ్టివాళ్ళే. కాని స్వభావం రీత్యా? ఏనాటి వాళ్ళో. అంచేత గురజాడ స్వభావరీత్యా కూడా యీనాటికీ ఆధునికుడే. కాలంరీత్యా ఆనాటికే ఆధునికుడు. యింతకీ ఆధునికత లక్షణాలు యేమిటి? గురజాడ ఆ లక్షణాలని యెలా ప్రతిఫలించేశాడు. ఆధునికతలో మొట్టమొదటిది జీవిత దర్శనం. సమాజం ముందుకు పోతోందా? వెనక్కి అడుగంటి పోతోందా? మనిషి జీవితం గతంలో బాగుందా? ముందు ముందు బాగుంటుందా? నమ్మకాలు మన జీవితాన్ని నడిపిస్తాయా లేక హేతుబద్ధమైన పరిశీలన నడిపిస్తుందా? స్త్రీ పురుష సంబంధాలకు పునాది యేది? భార్యాభర్తల అనుబంధం యే ఆధారాధేయ భావంగా వుంటుంది? యీ ప్రశ్నలకు మనమిచ్చే జవాబులే స్వభావ రీతిలో మనం యెంత ఆధునికంగా వున్నదీ తెలియచేస్తాయి. "గత కాలము మేలు వచ్చుకాలము కంటే" అని చెప్పేవాళ్లు సంప్రదాయవాదులు. అప్పట్లో జీవితమే ఆనందంగా వుండేదని వాళ్ల భావన. ఏ అవతార పురుషుడో వచ్చి రక్షిస్తాడని వాళ్ల నమ్మకం. కలియుగంలో ధర్మం ఒంటి కాలి మీద కుంటుతూ వుంటుందని వాళ్లకి గట్టి అభిప్రాయం. స్త్రీ పురుషునికి భోగవస్తువని వాళ్ల భావం. భార్యాభర్తలంటే భరిస్తూ, భరింపబడుతూ వుండడమన్నది వాళ్ల అభిప్రాయం. యీ అభిప్రాయాలన్నీ పాతగిల్లినవనీ ఆధునికులు జీవితపునాదే మారిందనీ చెప్పేవాళు ఆధునికులు. గురజాడ అలాంటి ఆధునికుడు. "మంచి గతమున కొంచెమేనోయ్ మందగించక ముందు కడుగేయ్" అని ఉద్బోధించేడు. ఆ పీనుగులు మనకంటే అధ్వాన్నంగా బతికారని అని గతించిన జీవితం గురించి చెప్పేడు. కన్నుగానని వస్తుతత్వము కాంచనేరరు ఇంగిలీజులు అంటూ హేతువాద దృక్పథాన్ని చాటేడు. ప్రేమ పెన్నిధి, అదే స్త్రీ పురుష సంబంధాలకు ఆధారం కావాలన్నాడు. మాయ మర్మము లేని నేస్తము మగువలకు మగవారి కొక్కటె అని వివాహ బంధంలోని పునాదిని ప్రస్తుతించేడు. యీ భావాన్ని కన్యాశుల్కం నాటకంలో గిరీశం మాటలు యింకా బాగా వెల్లడి చేస్తాయి. "మా మారియేజి ట్రూలవ్ మారియేజ్ గాని సాధారణ విడోమారియేజి కాద"ని గిరీశం బుచ్చమ్మకీ తనకీ గల ప్రేమ పునాదిని చెపుతాడు. మారేజ్‌కి లవ్ ఆధారం అన్నది యిక్కడ ముఖ్య అంశం. గురజాడ మూఢ నమ్మకాలకి వ్యతిరేకంగా, వర్ణవ్యవస్థకూ అస్పృశ్యతకూ వ్యతిరేకంగా గొంతెత్తి నినదించేడు. అసలు మతాలే మాసిపోవాలన్నాడు. యిది చాలా మహత్తర భావం. గురజాడ కవిత్వంలో తెచ్చిన మార్పులు ముత్యాల సరాల

## గురజాడ అప్పారావు జీవిత విశేషాలు

గురజాడ అప్పారావు విశాఖపట్నం జిల్లా ఎలమంచిలి తాలూకా రాయవరం గ్రామంలో 1862 సెప్టెంబర్ 21న జన్మించాడు. తండ్రి వెంకట రామదాసు, తల్లి కౌసల్యమ్మ, చీపురుపల్లిలో పదేళ్ళ వరకు చదివాడు. విజయనగరంలో బి.ఏ. చదువుతున్నపుడు వాడుక భాషా ఉద్యమ నాయకుడు గిడుగు రామమూర్తి ఆయనకు సహాధ్యాయి. 1884లో మహారాజ కాలేజి వారి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరాడు. 1885లో అప్పలనరసమ్మ గారితో వివాహమైంది. 1886లో డిప్యూటీ కలెక్టరు ఆఫీసులో హెడ్‌క్లర్కు పదవినీ, 1887లో కళాశాలలో అధ్యాపక పదవిని నిర్వహించాడు. 1886లో రాజా వారి ఆస్థానంలో చేరాడు. 1911లో మద్రాసు యూనివర్శిటీలోని బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో సభ్యత్వం లభించింది.

గిడుగు రామమూర్తితో కలిసి వాడుక భాషా వ్యాప్తికి ఉద్యమించాడు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కన్యాశుల్కం నాటకం 1892లో తొలి ప్రదర్శన జరిగింది. కన్యాశుల్కం తొలి కూర్పును మహారాజా ఆనందగజపతికి అంకితమిచ్చాడు. ఇప్పుడు మనకు దొరుకుతున్న కన్యాశుల్కం రెండవ కూర్పును 1909 నాటిది.

53 సంవత్సరాల వయసులో 1915 నవంబర్ 30న గురజాడ అప్పారావు మరణించాడు. ఆయనకు ముగ్గురు సంతానం – ఇద్దరు కుమార్తెలూ, ఒక కుమారుడు.

రూపంలో క్రొమ్మెరుంగులు చిమ్మేయి. కొమ్మెరుంగులు అన్నమాట చాలా అర్థవంతమైంది. తెలుగు కవిత్వ సీమలో ఆ మాట మేలుకొలుపులు పలికింది. అంతకు ముందు యెన్నడూ లేనంతగా కవిత్వంలో మార్పు వచ్చింది. భావంలో, భాషలో, ఛందస్సులో గురజాడ పథనిర్దేశం చేశాడు. ఆంగ్ల ప్రభావంతో కొత్త పుంతలు ఆవిష్కృతమయ్యేయి. గురజాడ దేశి కవిత్వాన్ని సముద్ధరించేడు. జానపదుల కవితా శిల్పాన్ని పునరుద్ధరించినట్టయింది. గురజాడ గ్రహించిన వస్తువు కాల్పనికమైంది కాదు. జనజీవితం, సహజ శోభితం. గురజాడ సాహిత్యాన్ని అంతఃపురాల నుంచీ, బంధ చిత్రరీతుల నుంచీ ప్రజాహితం కోసం ప్రజాపరం చేశాడు. అసలు తనది ప్రజల ఉద్యమమనీ చాటుకున్నాడు. పుష్కలమైన అనంతమైన సంఘటనలతో నిండివున్న యెంతో గాంభీర్యమూ వైవిధ్యమూ గల జీవితాన్ని వీక్షించాలని గుర్తు చేశాడు. అందుకే ఆయనకు వాస్తవ జీవితం స్తవనీయమైంది. భావంలో గురజాడ తెచ్చిన మార్పు ఆయన రాసిన అన్ని గేయాల్లోను ప్రతిఫలించింది. ఆయన కావ్యవస్తువులు యే కాల్పనిక లోకాల నుంచో దిగివచ్చినవి కావు. పాత్రలు సాంఘికమైనవి. లవణ రాజు కలలో మాలెత, కన్యకలో సెట్టి కూతురు పూర్ణమలో పూజారి కూతురు. యిక ఛందస్సులో ఒక విప్లవమే వచ్చిందని చెప్పాలి. ఆధునిక తెలుగు కవిత్వానికి ఆయన అందించిన ముత్యాలసరం ఒక అపురూపమైన కానుక. ఆయన ముత్యాల సరం ఛందస్సు కవిత్వ వ్యక్తీకరణ రూపాన్ని సమూలం మార్చివేసింది. యీ నూతన ఛందస్సు వల్ల వ్యర్థ పదాలకి, పాదపూరణ యెత్తుగడలకి ఉద్వాసన జరిగింది. కృత్రిమత్వం దొంగ చాటుగా దూరి రావడానికి కూడా సందు లేకపోయింది. భావంలో ఛందస్సులో వ్యక్తీకరణ పద్ధతిలో గురజాడ తెచ్చిన మార్పులు యెంత మౌలికమైనవో శైలిలో, రచనా విధానంలో ఆయన ప్రవేశపెట్టిన పద్ధతులు అంత మౌలికమైనవి. చమక్కులు, చమత్కారాలూ ఆడంబర పదగుంఫనలూ కాగడా వేసినా కనిపించవు. ఉదాహరణకు పదాన్ని గణబద్ధంగా రాసినప్పుడు, వ్యావహారిక నేపథ్యాన్ని తెచ్చుకున్నా, ఆ గణబద్ధమైన పడికట్లు తప్పవు. ఒగి, వెస లాంటి పూరకాలు అవసరమవుతాయి. గురజాడ అందించిన ఛందస్సులో భాషా పరమైన సహజ నుడికారమే వుంటుంది. అంచేత భేషజం, పాండితీ ప్రాగల్భ్యం లాంటివి చోటు చేసుకోవడానికి వీలే లేదు. హృదయాన్ని రసప్లావితం చేసే శైలి అది. గురజాడ కాలం నాడూ ఆ తర్వాతా చాలా మంది చాలా దేశభక్తియుత గేయాలు రాశారు. కాని ఆయన దేశభక్తి గేయం మనకి దేశభక్తిని ప్రభోధిస్తూనే అంతర్జాతీయ స్ఫూర్తిని కలిగిస్తుంది. ఎంతో విశాల హృదయంతో చూస్తేనే గాని యీ విశ్వమంతా మనదే అన్న సార్వజనీనమైన అనురాగాన్ని పొందలేమని ఆయన అన్న మాటలకు తాత్పర్యప్రాయంగా అయిందీ దేశభక్తి గేయం. దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని యెప్పుడైతే చాటుతున్నాడో అప్పుడే భౌతికమైన ఎల్లలూ సరిహద్దులూ దాటుతున్నాడన్నమాట! మతం మత విశ్వాసాలూ మానవాళిని దరి చేర్చలేవు. మత విశ్వాసాలనేవి ఆచరణకు అసాధ్యమైనవి. నిరోధకమైనవి. గుదిబండల వంటివి. మానవుని ప్రేమించడమనేది అతి సాధారణమైన సూత్రం అని ఆయన ఆనాడు అన్న మాటలు యివాళ యెంత ఔచిత్య పూరితమో చూడండి. అదీ ఆయన క్రాంతి దర్శిత్వం. ఆయన ఆలోచనారీతి, భావన. రచనలోని విశిష్టత యీ యుగాన్ని ప్రభావితం చేసిందంటే చెయ్యదూ? అందుకే ఆయన్ని నవయుగ వైతాళికుడు అని కీర్తించడం. ఆయన వారసత్వం ఆయన కాలాన్ని ఆయన సమకాలీనతని అధిగమించి తర్వాతి తరాలకు అంది వచ్చింది. అయితే యీ మధ్యలో వేరే ప్రభావాలూ తెలుగు కవిత్వం మీద ప్రసరించేయి. వాటి వల్ల ఆధునిక యుగ వికాసం మరింత తేజోవంతం అయింది. కవిత్వ వికాసం మరింత జేగీయమానమైంది. అయితే దారి చూపించినవాడు గురజాడ. తర్వాతి తరాల వాళ్లు ఆయన్ని అనుసరించేరు. అందుకనే "అడుగుజాడ గురజాడది. అది భావికి బాట" అన్న మాటలు అర్థవంతమయేయి. ఆయన మాటల్లోనే భావికి అడుగుజాడ పడిన తీరు గమనించవచ్చు. "నేను నా మొదటి గేయాలలో సాధ్యమైనన్ని వాడుక మాటలనూ, గ్రాంథిక వ్యాకరణ సూత్రాలనూ ప్రయోగించేను. పూర్ణమ్మలో వాడుక పదాలకంటే గ్రాంథిక వ్యాకరణ సూత్రాలకు సరిపడని శబ్దాలు యెక్కువ. యివి కన్యకలో మరీ హెచ్చు" దీన్ని బట్టి ఒక విషయం స్పష్టమవుతుంది. ఆయన ఉద్దేశపూర్వకంగా ప్రజా వాగ్వ్యహారాన్ని ప్రవేశపెట్టాలనుకున్నాడు. అది ఆనాటి పరిస్థితులలో నిజంగా దారి చూపించడమే. ప్రజాహితం అన్నది ఒక కోరిక మాత్రమే కాదు. ఆచరణలో అమలు జరపాల్సిన ఆదర్శం. అలాంటి ఆచరణకు నడుం కట్టడమే గురజాడ అడుగుజాడ. ◆

(20వ శతాబ్దాన్ని ప్రభావితం చేసిన తెలుగు కవులు అన్న పుస్తకం నుండి సంక్షిప్తంగా)

# మనకి ముందుచూపునిచ్చిన గురజాడ

## 150వ జయంతిని ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలి

" కవీ ప్రవక్తా ఎల్లప్పుడూ కాలం కంటే ముందు ఉంటారు." అన్న గురజాడ వాఖ్య ఆయనకు ఎంతో చక్కగా సరిపోతుంది. ఆయన సాహిత్యం సమాజంలో ఎందరికో జ్ఞానాన్ని - నాగరికతను నేర్పింది. "ఆధునికి మహిళలు చరిత్రను తిరిగి రాస్తారు అని ఆయన పలికిన పలుకులు సమాజంలో స్త్రీ శక్తిని మేల్కొలిపి ముందుకు నడిపించింది. ఆధునిక దక్షిణ భారతదేశంలోనే సంఘ సంస్కరణలకు విప్లవాత్మకమైన - శాస్త్రీయమైన చైతన్యానికి శ్రీ గురజాడ సాహిత్యం పునాది వేసింది.

సెప్టెంబర్ 21, 2012న గురజాడ 150వ జయంతిని ప్రభుత్వం ఘనంగా నిర్వహించి ఆయన ఆధునిక సమాజానికి అందించిన జ్ఞానాన్ని అందరికి పంచాల్సిన బాధ్యత ఉంది. రవీంద్రనాథ్ టాగూర్ మరియు స్వామి వివేకానంద 150వ జయంతి వేడుకలు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వాలు ఘనంగా నిర్వహించాయి. అలాగే మన ప్రభుత్వం కూడా గురజాడ 150వ జయంతిని ఘనంగా నిర్వహించాలి.

### "దేశమును ప్రేమించుమన్న...!"

దేశమును ప్రేమించుమన్నా! మంచి అన్నది పెంచుమన్నా!
.....దేశమంటే మట్టికాదోయ్! దేశమంటే మనుషులోయ్!

గురజాడ దేశభక్తి గీతం గొప్ప కవిత. దేశభక్తి అంటే ప్రకృతిని, ప్రకృతిలో మతాన్ని కలిపి మనల్ని మనం పొగుడుకోవడం కాదని, దేశభక్తి అంటే మనిషిని మనిషి ప్రేమించడం, మంచిని పెంచుదామని, జాతులు మతాలతో సంబంధం లేకుండా ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి జీవించాలన్నారు. ఇదీ గురజాడ ప్రబోధించిన 'దేశభక్తి'. భారతీయ దేశభక్తి గీతాల్లో అన్నింటి కన్నా ఇది ఉదాత్తమైంది. మహోన్నతమైనది.

ఆనాటి సమాజంలో మూఢ నమ్మకాలకు, మూఢాచారాలకు వ్యతిరేకంగా, స్త్రీలకు చదువు లేకపోవడం, బాల్య వివాహాలు, వితంతు వ్యవస్థ, కాలం చెల్లిపోయిన విద్యా వ్యవస్థ, అర్థం కోల్పోయిన వివాహ వ్యవస్థ, సారం కోల్పోయిన మత వ్యవస్థ, శాస్త్రీయత లోపించిన సాంఘిక వ్యవస్థ, అస్పృశ్యతా దురాచారం, మతవైషమ్యాలు, వేశ్యా సమస్య వంటి అనేక సామాజిక రుగ్మతలను ఖండిస్తూ, వాటి నిర్మూలనా ఆవశ్యకతను నొక్కి చెబుతూ తన సాహిత్యం ద్వారా సమాజాన్ని ఆలోచింప చేశారు.

'కన్యాశుల్కం', ద్వారా ఆనాటి సమాజంలోని రుగ్మతని, వజ్రాల వంటి తెలుగు మాటల ద్వారా సమాజాన్ని ప్రభావితం చేశారు.

రచయిత ఒక సమస్యను తీసుకొని రచన చేస్తే, కొంతకాలానికి ఆ సమస్య పరిష్కారమైనా ఆ రచనకు విలువ నిలిచేట్టు ఎలా రాయాలో గురజాడను చూసి నేర్చుకోవాలి. దేశ ప్రజలకు వెలుగు బాట చూపిన గురువు గురజాడ. ఆయన ముందుచూపుకు ప్రతి తెలుగు వ్యక్తి నమస్కరించాలి. ప్రతి ఒక్కరూ ఆయన కవితలను - సాహిత్యాన్ని హృదయ పూర్వకంగా స్వాగతించి అందరూ సంస్కారవంతులుగా ఎదగాలి.

గురజాడ 150వ జయంతి ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని ఆశిద్దాం.

**- జి.ఫణికుమార్**
జూనియర్ అసిస్టెంట్, ఎ.పి.ట్రాన్స్‌కో, రాయదుర్గం

## కొన్ని గురజాడ రచనలు

- ★ కన్యాశుల్కం
- ★ కొండుభట్టీయం
- ★ బిల్హణీయం (అసంపూర్ణం)
- ★ సారంగధర (ఇంగ్లీషు పద్యకావ్యం)
- ★ పూర్ణమ్మ
- ★ నీలగిరి పాటలు
- ★ కన్యక
- ★ లంగరెత్తుము
- ★ దించులంగరు
- ★ లవణరాజు కల
- ★ కాసులు
- ★ సౌదామిని (అసంపూర్ణం)
- ★ **కథానికలు**
- ★ మీపేరేమిటి
- ★ దిద్దుబాటు
- ★ మెటిల్డా
- ★ సంస్కర్త హృదయం
- ★ పెద్ద మసీదు
- ★ గురజాడ వ్యాసచంద్రిక

# సురాజ్యం నాకొద్దు

సుస్థిరత... సుపరిపాలన
ఒకే నాణేనికి... రెండు పార్శ్వాలుగా
సురాజ్యం జాతికి ఒకమేలు కొలుపేకాదు
ఒక చల్లని పిలుపుకూడ
ఎందరో చచ్చీ చెడీ తెచ్చిన
దేశ స్వాతంత్ర్యం అరవై ఐదు
సంవత్సరాలు గడిచినా
ఇంకా మిగిల్చిన ఆకలి అనారోగ్యం
నిరుద్యోగం పేదరికం
మనికి దక్కిన వారసత్వపు
ఆస్తులుగా అందిస్తూ సా.... గుతోంది
అవినీతి కుంభకోణాలకు స్థానమైన పాలన
ప్రతీ ఎన్నికలకు జనాన్నుద్ధరిస్తున్నట్లు
ప్రజాకర్షక పథకాల జిలుగులు అద్దుతూ
ఉచితానుచితాల మేనిఫెస్టోలు జోడిస్తూ
అరచేతిలో ప్రజలకి వైకుంఠం చూపిస్తూ
ఎక్కడ వేసిన గొంగళీ అక్కడేలా
మారని బడుగు జీవుల బతుకులు
అయినా ముద్దుగా దేశాన్ని ప్రజాస్వామ్యంగ పిలుస్తాం కానీ
ధనస్వామ్యం రీతిగా ఓట్లూ పదవులూ కొనబడుతూ
రాజకీయాన్ని వ్యాపారంగా మార్చిన (వి) నాయకులు
స్వార్థానికి... స్వలాభానికి మనమే బలిపశువులం
జనానికి యే ఏటికాయేడు
త్యాగాలకి సిద్ధంకండంటూ నేతల ఉద్బోధలు వింటూ
కష్టనష్టాలెన్నింటినో ఎదుర్కొంటూ మనకున్న
సహజ సహనగుణంతో....
ప్రతీ ఐదేళ్ళ ఎన్నికలకీ ఓటేస్తాం రాజ్యాంగ బద్ధంగా
గెలిపిస్తాం మళ్ళీ మళ్ళీ
మనకందించే పప్పుబెల్లాల పార్టీని
తెచ్చుకుంటాం ఏదో తక్కువ అవినీతి ప్రభుతని ఏరికోరి
మరో ప్రపంచానికై కన్నెత్త చూడం
ఎందుకంటే మరో మార్పుకై మనం తలవొగ్గం
ఇప్పుడున్నదే పొందినదే ఒక స్వర్గం
వదిలేస్తాం దుర్భర జీవితాల్ని ఏ కర్మకో
త్యాగానికో అలవాటుగా ఈ పుణ్యభూమిలో పుట్టినందుకు
అందుకే సురాజ్యం నాకొద్దు
మరినే బాగుపడి పోతేనో?!

**- బి.ఎ.నరసింహులు ,** నరసన్నపేట



# ప్రజాస్వామ్యం... నాయ 'కుల' స్వామ్యమా?

ప్రజాస్వామ్యంలో
ప్రజలే ప్రభువులు
పాలకులు సేవకులు
కాని మనదేశంలో
పాలించేది నాయకులు
పాలించబడేది ప్రజలు
'మతం' పేరుతో ఓట్లు గుంజడం
'కులం' పేరుతో సీట్లు పొందడం
'ధనం' మాటున రాజకీయం చేయడం
ఇదే! మన పాలకులు నడిపించే ప్రజాస్వామ్యం
ప్రజల ఓట్లతో గెలిచి
ప్రజా ప్రతినిధులుగా మారి
ఆ ప్రజలనే బలి పశువులుగా మార్చుతున్నారు
ఇది! నేటి మన నేతల తీరు
ఉన్న వాడికి అంత్యోదయ కార్డులు
లేని వాడికి అక్కరకురాని (పింక్) కార్డులు
ధనికుడికి ఇందిరమ్మ ఇళ్ళు
నిరుపేదలకు నీడలేని పందిళ్ళు
ఇది! మన ప్రభుత్వ పనితీరు
రాజకీయంలో స్వార్ధపరులకు 'లాభం' ముఖ్యం
నిస్వార్థ పరులకు ప్రజాసంక్షేమం ముఖ్యం
అవినీతిపరులకు ఆదాయం ముఖ్యం
నిజాయితీపరులకు సేవ ముఖ్యం
అందుకే ప్రజలు ప్రశ్నించడం నేర్చుకోవాలి
పాలకులు సమస్యలు పరిష్కరించడం నేర్చుకోవాలి.

**- కె. సురేష్‌బాబు,** కరీంనగర్

# జగన్నాథ రథ చక్రాలు

- బండారు రామ్మోహన్‌రావు

ఆ రోజు ఉదయాన్నే అనంతపురం నుంచి బయలుదేరి కడపలో సురాజ్య కార్యక్రమానికి వెళ్ళాల్సి ఉంది. కడప ఇంఛార్జీ జగన్నాథ రెడ్డితో పాటు నేను అనంతపురంలో ఆర్.టి.సి బస్ ఎక్కాను. మధ్యలో మంగపట్టణం అనే ఊరు ఉంది. అక్కడ రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద గేటు పడింది. అటుపక్కా ఇటుపక్కా వాహనాలు క్యూ కట్టాయి. అరగంట తరువాత గేటు తెరిచారు. మా బస్సు స్టార్ట్ కానని మొరాయించింది. రెండు మూడు సార్లు డ్రైవరు బస్సును స్టార్ట్ చేయడానికి ప్రయత్నించి విఫలమై 'ఇక దిగండయ్యాబాబు బస్ నెట్టండ'ని ప్రయాణికులను పురమాయించాడు. మొదటగా దిగింది బస్ కండక్టరే. ప్రయాణికులందరూ దిగాలా వద్దా అని ముఖాలు చూసుకుంటున్నారు. ఆ వెంటనే లోక్‌సత్తా భావజాలం వంటబట్టినందువల్ల నేనూ, జగన్నాథ రెడ్డి ఇద్దరమూ దిగాం. ధోవతి కట్టుకున్న ఇద్దరు రైతులు కూడా మాతోపాటే బస్ దిగారు. మొత్తంమీద బస్ నెట్టడానికి ఐదుగురం పూనుకున్నాం. ఎంత నెట్టినా కదలడం లేదు. "బస్ లోపల యాభైమందికి పైగా ప్రయాణీకులున్నారు. డ్రైవర్‌కు కోపం వచ్చింది. 'మొద్దుల్లాగా యాభై మంది కూర్చున్నారు. ఐదుగురు నెడితే బస్ కదులుతుందా .... మరో నలుగురు దిగండయ్యా... అంటూ నేనూ దిగాలా' అంటూ దిగబోయాడు. ఆ తిట్లకి ఇక తప్పదన్నట్లు మరో నలుగురు ప్రయాణీకులు ఊసూరుమంటూ దిగారు. మొత్తం తొమ్మిదిమంది బస్ నెడుతున్నాం. మెల్లగా బస్ కదిలింది. యాభై అడుగులు నెట్టామో లేదో.. సరిగ్గా రైలుపట్టాలమీదకి వచ్చి ఆగిపోయింది.

వెనకనుంచి ముందునించి హారన్ మోతలు. గొడవ గొడవగా ఉంది. మేము ఎంత నెట్టినా బస్ కదలనంటోంది. అరగంట నుండి గేటుపడింది గనుక వాహనాల సంఖ్య పెరిగింది. అందరూ కంగారుపడుతున్నారు. మా బస్‌లోపల వున్న ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఆర్.టి.సి పనితీరు గురించి, వారి అలసత్వం గురించి, బస్‌ల గురించి చర్చించుకుంటున్నారు. ఏ.పి.యస్. ఆర్.టి.సి అంటే ఆగదు, పోదు, సమయానికి, రాదు, టిక్కెట్లు తీసుకున్నా కదలదు అంటూ అబ్రివేషన్స్ సెలవిస్తున్నారు. ఆగిపోయిన బస్సును నెట్టడానికి మాత్రం ఒక్కరూ ముందుకు రావడం లేదు. ఆర్.టి.సి బస్ ఆగిపోవడానికీ, మన వ్యవస్థకి ముడిపెట్టి ఒక సోషలిస్టు ప్రపంచబ్యాంకు కుట్ర గురించి వివరిస్తున్నాడు. ఇంతలో ఎదురుగా ఆగిన లారీల్లోనుండి ఇద్దరు పదహారేళ్ళ ముక్కుపచ్చలారని లారీల క్లీనర్లు మా బస్ వద్దకు వచ్చారు. **'తొమ్మిది మంది బస్ నెడుతుంటే బస్సు కదలదా.. అందరూ ఒక్కపట్టు పట్టండి అప్పుడు బస్ ఎలా కదలదో చూస్తామంటూ'** మా బస్సు నెట్టడం మొదలెట్టారు. అప్పటిదాకా బస్సు నెడుతున్న మా తొమ్మిదిమందిలో కొందరేమో ఎదో బస్సు నెడుతున్నట్టు నటిస్తూ బస్సుకి చేతులానిస్తే ఒకరిద్దరు మాత్రమే గట్టిగా నెట్టే



ప్రయత్నం చేస్తున్నారు. అలా విడతలు విడతలుగా ఎవరికి వారే బస్సును నెట్టడం మళ్ళీ జారవిడవడం చేస్తున్నారు. దాంతో క్లీనర్లు చెప్పిన మంత్రం బాగా పనిచేసింది. వాళ్ళు మమ్మల్ని హుషారు పరిచారు. అందరం ఒకేపట్టు పట్టాం. ఇంకేముంది బస్సు ఒక్క ఉదుటున రైలు పట్టాలే కాదు, హిమాలయాలు అడ్డువచ్చినా దాటేస్తామన్నట్లు పట్టాలు అవతలికి దాటి స్పీడుగా వెళ్ళి స్టార్ట్ అయింది. అందరి ముఖాల్లో ఆనందం. లారీ క్లీనర్లు చెప్పేదాకా మేం చేస్తున్న పొరపాటు మాకర్థం కాలేదు. ఎంత మంది నెడుతున్నారనేది పాయింటు కాదు. అందరూ ఒకేసారి నెట్టారా లేదా అన్నది అసలు సంగతి. అక్కడ క్లిక్కయింది, బస్సు కదిలింది.

# ఒక మార్గదర్శిని కోల్పోయాం -డా॥ కురియన్ మృతిపై జేపీ



డా॥ వర్గీస్ కురియన్ ఆధునిక భారతదేశపు గొప్ప హీరోలలో ఒకరని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. "కురియన్ కృషి గ్రామీణ భారతదేశం పట్ల నా అవగాహనను ప్రగాఢం చేసి, గ్రామీణ పేదల కొరకు, రైతుల కొరకు పోరాడేలా నాకు స్ఫూర్తినిచ్చి నడిపించింది. నా గొప్ప మార్గదర్శిని కోల్పోయాను" అని జేపీ పేర్కొన్నారు.

"తొలితరం భారతీయ వృత్తి నిపుణులలోని అరుదైన వ్యక్తులలో డా॥ కురియన్ ఒకరు. గ్రామీణ భారతీయులను వారి ఆర్థిక విముక్తి దిశగా సంఘటితం చేసేందుకు ఆయన తన శక్తిసామర్థ్యాలను, నైపుణ్యాలను, పరిజ్ఞానాన్ని అసాధారణ తపనతో వెచ్చించారు. ఆపరేషన్ ఫ్లడ్‌కు రూపకల్పన చేసి అమలుపరిచిన కురియన్, ఆ కృషిలో అద్భుత విజయాన్ని సాధించారు. భారతదేశంలో పాల విప్లవానికి నాంది పలికారు. చిన్నరైతులు సహకార వ్యవస్థ ద్వారా పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్, మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను అందుకునేలా చేయటంలో కురియన్ విశేష ప్రజ్ఞాపాటవాల్ని ప్రదర్శించారు" అని జేపీ అన్నారు.

సహకార సంఘాలకు స్వావలంబన, స్వతంత్ర ప్రతిపత్తి కల్పించేందుకు 1995లో రాష్ట్రంలో తీసుకొచ్చిన పరస్పర సహాయ సహకార సంఘాల చట్టం (ఏపీ మ్యాక్స్, 1995) వెనక స్ఫూర్తి డా॥ కురియనేనని జేపీ గుర్తుచేసుకున్నారు.

ఒక శిఖరప్రాయ వ్యక్తిని, రైతుల ఛాంపియన్‌ని, స్వతంత్ర ప్రతిపత్తిగల సహకార సంఘాలకు రాజీలేని మద్దతుదారుడిని భారతదేశం కోల్పోయింది అని కురియన్‌కు జయప్రకాష్ నారాయణ్ ఒక ప్రకటనలో అంజలి ఘటించారు.

ఈ సంఘటన చూసిన తరువాత మన సమాజం కూడా అచ్చంగా ఇలానే వుందనిపించింది. **'పట్టాలమీద ఆగిపోయిన బస్‌లాగే స్వరాజ్యం వచ్చినా సురాజ్యం రాకుండా మన సమాజగతి కూడా ఆగిపోయింది'.** ఆగిన బస్సులో కూర్చున్న ప్రయాణీకుల్లాగే మనందరం సుదీర్ఘమైన చర్చలు చేస్తున్నాం. కొందరు మాత్రమే ఆగిన సమాజ ప్రగతిని ముందుకు తీసుకెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు. కాని వాళ్ళల్లో వాళ్ళకి వ్యక్తిగత, సిద్ధాంతపరమైన విభేదాలు అందరూ ఒక లక్ష్యం వైపు ప్రయాణిస్తున్నా మార్గాలు వేరుగా వున్నాయి. దాంతో వెంటనే ఫలితాలు రావడం లేదు. మార్గాలు వేరేనా లక్ష్యం ఒక్కటే అనే ధ్యాస వుంటే సమాజ ప్రగతిరథ చక్రాలు కూడా కదిలేవి. ఆ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణీల గమ్యం ఒకటి కాదు. ఎవరి గమ్యం రాగానే వారు దిగిపోతారు. కాని ఆ బస్సును తమ గమ్యం వైపు వెళ్ళేలాగా అందరం ప్రయత్నించాం. అలాగే సమాజగతి అనే గమ్యం వైపు మనం ప్రయాణించడానికి అందరూ పాటుపడితే తప్ప సాధ్యంకాదు.

'పద్నాలుగేళ్ళుగా మిమ్మల్ని చూస్తున్నాను, ప్రతీసారి స్వరాజ్యమో, సురాజ్యమో ఇలా యాత్రలు పెడుతూ తిరుగుతుంటారు మీకెప్పుడూ నిరాశ కలగలేదా' అన్నాడు జగన్నాధరెడ్డి. నీ పేరులోనే జగన్నాధుడున్నాడు, మనదేశంలో ఒడిషా రాష్ట్రంలో పూరీలో కూడా జగన్నాధుడున్నాడు. అక్కడ ప్రతి ఏటా రథయాత్ర జరుగుతుంది. విశాలమైన రోడ్డులో వేలాదిమంది ప్రజలు జగన్నాధుని రథాన్ని లాగుతుంటారు. అలా లాగుతూనే కొందరు ఆ చక్రాల కింద నలిగిపోతుంటారు. అలాని ప్రతి సంవత్సరం రథాన్ని లాగే వారి సంఖ్య పెరుగుతుందే తప్ప తరగదు. మహిమగల దేవుడి రథచక్రాలు కదలాలంటే మనుషులే కావాలి కదా! దేవుడికే మనిషి అవసరం పడ్డాకా మానవమాత్రులమైన మన బస్సు ఆగిపోతే ఎవరు నెట్టాలి, మనమే నెట్టాలి అన్నాను సమాధానంగా.

అలాగే ప్రగతి రథ చక్రాలు కూడా ఆగిపోతున్న సందర్భంలో మార్పుకోసం, మంచికోసం చాలామంది మహానుభావులు ఈ భూమిమీదే పుట్టారు. వాళ్ళ జీవితకాలంలో వాళ్ళు కోరిన సమాజహితానికి, మార్పుకి కట్టుబడి పనిచేశారు. అందుకే ఇవాళ మనం ఇలా సుఖంగా జీవించగలుగుతున్నాం. వాళ్ళే గనక నాకేం పోయిందని అనుకుంటే మనకీసౌకర్యాలుండేవే కావు. సమాజహితం కోరే మంచివారు ఏకమైతే బస్సేంఖర్మ ప్రగతిరథచక్రాలే కదులుతాయి. అంతదాకా మళ్ళీ మళ్ళీ మనం ఈ ప్రయత్నం చేస్తూనే ఉండాలని ముగించాను. ■

# జనచిత్ర 'రాజయ్య'కు లోక్‌సత్తా నివాళి



స్వచ్ఛమైన తెలంగాణ జానపద జీవితాన్ని తన కళ ద్వారా అజరామరం చేసిన అంతర్జాతీయ చిత్రకారుడు కాపు రాజయ్య అని లోక్‌సత్తా పార్టీ నివాళులర్పించింది. మెదక్ జిల్లా సిద్దిపేటలో రాజయ్య భౌతికకాయాన్ని పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, ఇతర నేతలు సందర్శించి అంజలి ఘటించి, ఆయన అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

"ప్రకృతితో అవినాభావ సంబంధాన్ని కాపాడుకోవటమే మనిషి సుఖసంతోషాలకు మార్గమని గాఢంగా నమ్మిన రాజయ్య... తన జీవనయానానికి, కళకు అదే సూత్రాన్ని చుక్కానిగా చేసుకున్నారు. అంతరంగానికి, ఆచరణకు ఎటువంటి వైరుధ్యం లేకుండా జీవించారు. అందుకే, ఆదరణ కోల్పోతున్న గ్రామీణ వృత్తులను, వ్యవసాయాన్ని, సంస్కృతీసంప్రదాయాలను అపురూప దృశ్యాలుగా మలచగలిగే తన సృజనాత్మక సామర్థ్యాన్ని దశాబ్దాలపర్యంతం పరిరక్షించుకోగలిగారు. ఎన్నో పురస్కారాల్ని అందుకుని, ఎంతో ఎత్తుకు ఎదిగినా, ప్రజల మధ్య ఒకరుగా నిరాడంబరంగా జీవించగలిగారు.

లోక్‌సత్తా పట్ల రాజయ్య ఎంతో అభిమానాన్ని, ఆదరణను కనబరిచారు. ఎన్నికల సంస్కరణల కోసం లోక్‌సత్తా ఉద్యమసంస్థ చేపట్టిన కార్యక్రమంలో ఆయన భాగస్వాములయ్యారు. లోక్‌సత్తా కార్యాలయానికి తన ఇంట్లోనే జాగా కూడా ఇచ్చారు. రాజయ్య మృతి జాతికి పెద్దలోటు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియచేస్తున్నాం. రాజయ్య కళాఖండాలను భద్రపరచటంతోపాటు నిరంతరం స్ఫూర్తినిచ్చేలా ఆ చిత్రకారుడి స్మారక చిహ్నాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలి" అని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు.





# సుమన్ మరణం కళారంగానికి లోటు

## లోక్‌సత్తా ప్రగాఢ సంతాపం

తన బహుముఖ కళాప్రజ్ఞతో టెలివిజన్ కార్యక్రమాలను తెలుగునాట ఇంటింటికీ చేర్చిన ఘనత సీహెచ్. సుమన్‌కే దక్కుతుందని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ముఖ్యంగా ఈటీవీ విస్తరణకు సుమన్ చేసిన కృషి ఎంతో విలువైనదని, ఆయన అకాలమరణం బాధాకరమని జేపీ తీవ్రవిచారం వ్యక్తం చేశారు. రామోజీరావుకు, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

రామోజీ ఫిలింసిటీలో జరిగిన సుమన్ అంత్యక్రియలలో జేపీతోపాటు లోక్‌సత్తా ఇతర నేతలు పాల్గొన్నారు.










న్యూయార్క్‌లో ఆగస్టు 15న భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పీపుల్ ఫర్ లోక్‌సత్తా న్యూజెర్సీ ఛాప్టర్ నిర్వహించింది. సురాజ్యం సాధించాలని నినాదాలు చేసి, సురాజ్యం కోసం ఉద్యమించాలని ప్రతిజ్ఞ చేశారు.

# ప్రజా చైతన్యంతోనే పాలనలో అవినీతి అంతం

## స్వతంత్ర సమరయోధులు చెన్నమనేని రాజేశ్వరరావు



### హయత్‌నగర్

ప్రజల్లో చైతన్యం వచ్చినపుడే పాలనలో అవినీతిని నిర్మూలించడం సాధ్యమవుతుందని స్వతంత్ర్య సమరయోధుడు చెన్నమనేని రాజేశ్వరరావు, ఎమ్మెల్యే, సుధీర్ రెడ్డి అన్నారు. లోక్‌సత్తా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సురాజ్య ఉద్యమంలో భాగంగా సెప్టెంబర్ 9న హయత్‌నగర్‌లోని స్వామిశంకర్ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజలకు ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తూ వారు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా అభివృద్ధి సాధిస్తారని, ఎన్నికల సమయంలో ఓటర్లు డబ్బులు, మద్యం, ఇతర ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా, ఓటు వేయడం ద్వారా ఎన్నుకుంటే... ప్రజాప్రతినిధులను అనంతరం ప్రశ్నించడానికి వీలుంటుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి నిర్మూలనలో భాగంగా జవాబుదారీతనాన్ని పెంపొందిండానికి సిటిజన్ చార్ట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అవినీతికి పాల్పడిన అధికారుల నుంచి సదరుసొత్తును రికవరీ చేయడం ద్వారా వారిలో మార్పును తీసుకురావాలని సూచించారు. సురాజ్య ఉద్యమ ఆర్గనైజర్లు నక్క సంజీవ్ కుమార్, కె. కృష్ణల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి జి. రాజారెడ్డి, లోక్‌సత్తా కార్యదర్శి యస్. మనోరమ, గ్రేటర్ అధ్యక్షులు సత్యనారాయణ, ఎల్‌బీనగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆకుల రమేష్‌గౌడ్, వర్కింగ్ కమిటీ సభ్యులు నందిపేట రవీందర్, శుభోదయ కాలనీ అధ్యక్షులు ముత్యాల చంద్రశేఖర్ రాదు, నాయకులు నక్క రవీందర్ గౌడ్, దర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త వ్యవస్థలతోనే సరికొత్త జీవనం

## లోక్‌సత్తా నాయకులు కటారి శ్రీనివాసరావు




### ఉప్పల్‌లో రౌండ్‌టేబుల్

సురాజ్య ఉద్యమం ద్వారా కొత్త వ్యవస్థలతో సరికొత్త జీవనాన్ని సాధించుకోవాలని లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసరావు అన్నారు. సాయంత్రం ఆరుల్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో లోక్‌సత్తా ఆధ్వర్యంలో సుపరిపాలన కోసం సురాజ్య ఉద్యమం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో శ్రీనివాసరావు ప్రసంగిస్తూ తొలుత కలుషితమైన రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చేయాలన్నారు. ఇందు కోసం ప్రజా ఉద్యమం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు మనోరమ, గజానన్, గ్రేటర్ అధ్యక్షులు, ఎం.సత్యనారాయణ, రవీందర్, వెంకటేశ్వర్లు నాయకులు ఎ.పార్ధసారధిరావు, కె.జగన్, కె.నాగరాజు, బి.శివరామక్రిష్ణ, పి.శరత్‌చంద్ర పాల్గొన్నారు.

# యువతతోనే అవినీతిరహిత సమాజం

## HMTV CEO కె. రామ చంద్రమూర్తి



ప్రపంచంలో అత్యంత ప్రతిభావంత శక్తి ఉన్న భారత యువతకు దిశా నిర్దేశం చేయగలిగితే అవినీతి రహిత సమాజాన్ని స్థాపించవచ్చునని HMTV CEO కె.రామ చంద్రమూర్తి అన్నారు. సురాజ్య ఉద్యమం ఆధ్వర్యంలో స్థానిక కవిరాజు పార్కులో సాయంత్రం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యాక్షుడు జె.ఐ.రామ్మూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామచంద్ర మూర్తి మాట్లాడుతూ దేశంలోని కిందిస్థాయి ప్రజల్లో చట్టాలు హక్కుల గురించి అవగాహన లేదన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలపై ప్రజల పక్షాన నిలిచే మీడియా నిఘా వరిధి పెంచాలన్నారు. మాజీ ఎం.పి.సోలిపేట రామచంద్రారెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థలకు అధికార వికేంద్రీకరణ చేయాలన్నారు. పంచాయతీలు, పట్టణాలకు వారి హక్కుల మేరకు బదలాయింపులు జరగాలన్నారు. తణుకు డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ మనోరమ మాట్లాడుతూ దేశంలో పేదరికం పోవాలంటే కావాల్సింది రాయితీలు కాదన్నారు. సుపరిపాలన కోసం సురాజ్య ఉద్యమాన్ని అందరూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కొత్త శివరామకృష్ణ ప్రసాద్, పి.దక్షిణామూర్తి, ముత్తేవి రవీంద్రనాథ్, దర్శి శివకోటేశ్వరరావు, పోలేశ్వరరావు, కొత్తమాసు తులసీదాస్, ప్రియబాంధవి, రాజశ్రీ, రంగయ్య మాట్లాడారు.

### తెనాలిలో రౌండ్‌టేబుల్

# స్వాహారాజ్యాన్ని సురాజ్యంగా మార్చుదాం

### పత్తికొండ రౌండ్‌టేబుల్

దశాబ్దాలుగా దేశనాయకులు ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న 'స్వరాజ్యం' స్వాహా రాజ్యంగా మారిందని, దాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒకరికి ఉందని సురాజ్య ఉద్యమం జిల్లా గౌరవాధ్యక్షులు బీఎన్ చెట్టి అన్నారు. సురాజ్య ఉద్యమంలో భాగంగా లోక్‌సత్తా ఆధ్వర్యంలో పత్తికొండ కన్యకాపరమేశ్వరీ కల్యాణ మంటపంలో జరిగిన అఖిల పక్ష నాయకులు, ప్రజా సంఘాల సదస్సుకు ఆయన ముఖ్యతిథిగా హాజరయ్యారు. లోక్‌సత్తా నియోజకవర్గ బాధ్యుడు ఆనందాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజకీయాన్ని కొందరు నాయకులు వ్యాపారంగా మార్చి అంతులేని దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. పార్టీలు కొందరి వ్యక్తుల, కుటుంబాల సొంత ఆస్తిగా మారాయన్నారు. లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు బండారురామ్మోహన్‌రావు, ఓంకారయ్య తదితరులు మాట్లాడారు. ఈ సదస్సుకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు గురుదాసు, రంగారెడ్డి, తిరుపాలు, అశోక్‌కుమార్, సురేంద్రకుమార్, హనుమంత నాయుడు, న్యాయవాది ఈరన్న, లోక్‌సత్తా, యువసత్తా నాయకులు అల్లాబకాష్, రామమోహన్, మధు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ప్రభుత్వాలతోనే ప్రజలకు మంచి వసతులు

## మాజీ ఎంపి సోలిపేట రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆంజనేయులు, మాజీ ఎంపి సోలిపేట రామచంద్రారెడ్డి, తదితరులు

### వినుకొండ రౌండ్‌టేబుల్

సురాజ్య ఉద్యమ రౌండ్‌టేబుల్ వినుకొండ ఎన్ఎస్‌పి గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జె. ఐరామమూర్తి అధ్యక్షత వహించారు. సురాజ్య ఉద్యమ నిర్వాహకుడు పాలపర్తి నరేష్ బాబు సభ పరిచయం చేశారు. ప్రధాన వక్తగా విచ్చేసిన ఎస్. మనోరమ మాట్లాడుతూ దేశ భవిష్యత్ నిర్దేశించే పౌరులు పాఠశాల తరగతి గదిలో రూపుదిద్దుకుంటున్నారని, వారికి ఉపాధ్యాయులు సురాజ్య స్ఫూర్తిని అందించాలని అన్నారు. మాజీ పార్లమెంట్ సభ్యులు సోలిపేట రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామ పట్టణ స్థాయిలో మంచి వసతులు, అవినీతిలేని పాలన స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసుకోవడం ద్వారా సాధించవచ్చని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే జివి ఆంజనేయులు మాట్లాడుతూ పాలనతీరు మెరుగుపడాలన్నా, అవినీతిని అదుపు చేయాలన్నా ప్రజాచైతన్యం అవసరమని అన్నారు. పలువురు న్యాయవాదులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ సురాజ్య ఉద్యమానికి తమ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పిజె లూకా, ఎంఎన్ ప్రసాద్, పి.సైదారావు, ఎలీషాబాబు, కె. నాగేశ్వరరావు, వై సత్యనారాయణ, డాక్టర్ గోగినేని సాంబశివరావు, దస్తగిరి, టి. వెంకట్, చుండూరి వెంకటేశ్వర్లు, బండి కోటయ్య, సివి కృష్ణయ్య, బివి సత్తార్, అప్పరాజు, నాగేశ్వరరావు, ఎ రమేష్, చంద్రజిత్ యాదవ్, కవి కరిముల్లా, శ్రీనివాసరావు, సంగీరావు, శ్రీధర్ ప్రసాద్, భవానీ శంకర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలన మన పౌరహక్కు

## లోక్‌సత్తా నాయకులు బండారు రామ్మోహన్‌రావు



### గుంతకల్లు

ఓటువేసేది ప్రజలు, పన్నులు కట్టేది ప్రజలు. సుపరిపాలన పౌరహక్కని, దీనిని సురాజ్య ఉద్యమం ద్వారా సాధించుకోవాలని లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు బండారు రామ్మోహన్‌రావు అన్నారు. గుంతకల్లు ఆర్ అండ్ బిగెస్ట్ హౌస్‌లో జరిగిన సురాజ్య రౌండ్‌టేబుల్ లోక్‌సత్తా పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ అధ్యక్షతన జరిగింది.

సమావేశంలో వివిధ స్వచ్ఛంద సంస్థల నాయకులు, రాజకీయ పార్టీ నాయకులు, పౌరసమాజంలోని ప్రముఖులు పాల్గొని తమ తమ సందేశాలిచ్చారు. లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు ఓంకార్ సురాజ్య ఉద్యమ లక్ష్యాలను వివరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వన్నూరప్ప పట్టణ బిజెపి నాయకులు కె.శేకన్న, దళిత మోర్చ నాయకులు రామాంజనేయులు, హ్యాండ్స్ సంస్థనాయకులు సురేష్, ఏఐటియుసి నాయకులు వీరభద్రి, సిపిఐ తరుపున మక్బుల్, ఎఐవైఎఫ్ నాయకులు ఎస్ ఎండి గౌస్, లయన్స్ క్లబ్ నాయకులు గోపాలక్రిష్ణ జెవివి నాయకులు హరిప్రసాద్, బిఎస్‌పి నాయకులు శ్రీనివాసరాజు, మార్కెట్ యార్డు మాజీ చైర్మెన్ దేవేంద్రప్ప, తదితరులు రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు.

**సురాజ్య ఉద్యమ కమిటీ**

గౌరవాధ్యక్షులుగా జి.దేవేంద్రప్ప, అధ్యక్షులుగా ఎన్.సి.లక్ష్మినారాయణ, కన్వీనర్‌గా మహమ్మద్ గౌస్, ఉపాధ్యక్షులుగా రామాంజనేయులు, శ్రీనివాసరాజు, ప్రదాన కార్యదర్శిగా హరి ప్రసాద్ యాదవ్, సహాయ కార్యదర్శిగా క్రిష్టమూర్తి, కోశాధికారి ఎస్.రామ్మోహన్

# 'స్థానికం' బలోపేతంతోనే సురాజ్యం

## డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపు



దేశంలో స్థానిక సంస్థలు బలోపేతమైనప్పుడే స్వరాజ్యంలో సురాజ్యం సాధ్యమవుతుందని రాష్ట్ర సురాజ్యఉద్యమ కన్వీనర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. నగరంలోని ఐఎంఏ హాల్‌లో జరిగిన 'సురాజ్య ఉద్యమం' రౌండ్‌టేబుల్ సమావేశంలో పలు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, నగర ప్రముఖులు, విద్యావేత్తలు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర బడ్జెట్ ప్రతి పౌరుడికి తలసరి రూ॥1000/- నేరుగా స్థానిక సంస్థలకు కేటాయించి అక్కడి అవసరాలకు ఖర్చు చేసే విధానం అమలులోకి రావాలన్నారు. సమర్థులు, నిజాయితీపరులు రాజకీయాల్లోకి వచ్చి మార్పుకు శ్రీకారం చుట్టాలని సూచించారు. దేశంలో దామాషా పద్ధతిలో ఎన్నికలు జరగాలన్నారు. విద్యార్థులు, యువత, రైతులు, మహిళలు తదితర వర్గాలను కలుపుకుని సురాజ్య ఉద్యమంలో భాగస్వాములను చేస్తామన్నారు. మాజీ ఎంపీ ఎస్.రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ స్వరాజ్యం వచ్చినా ఇంకా సురాజ్యం రాలేదన్నారు. గ్రామాల్లో ప్రతి చిన్న ప్రభుత్వ సేవకు అవినీతి లేకుండా పని జరగడం లేదన్నారు. వీటిపై స్థానిక ప్రజానీకం చైతన్యవంత మవ్వాలని పిలుపునిచ్చారు. మాజీ ఎం.పీ చెన్నుపాటి విద్య, మాజీ ఎమ్మెల్యే కె.సుబ్బరాజు, సీపీఎం నగర కార్యదర్శి సిహెచ్.బాబూరావు ప్రసంగించారు. నగర ప్రముఖులు అందవల్లి సత్యనారాయణ, ఎంపీ దాసు, జంపా కృష్ణకిషోర్, నారాయణ ప్రసాద్, కర్నాటి లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొనగా పార్టీ నేతలు కామినేని పట్టాభిరామయ్య, చెన్నుపాటి వజీర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**విజయవాడ**

# కోటిమందికి సురాజ్య చైతన్యం - జేపీ




గుంటూరులో జరిగిన సురాజ్య ఉద్యమ రౌండ్‌టేబుల్ సమావేశంలో లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ సురాజ్య ఉద్యమంలో తొలిదశలో రైతులు, మహిళలు, విద్యార్థులు ముందుకొచ్చారని, రానురాను కోటి మందిని చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ ఛార్టర్‌లు ఏర్పాటుచేసి, గడువులోపు పనులు చేయకపోతే జరిమానా విధించేలా పౌరసేవల హక్కు చట్టం తేవాలనేది తమ మొదటి డిమాండ్ అని చెప్పారు. గ్రామాలు, వార్డుల్లో పారిశుద్ధ్యం, రోడ్లు, మంచినీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను కల్పించుకునేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో తలసరి 10 శాతం నిధులు కేటాయించాలనేది రెండో డిమాండని చెప్పారు. అవినీతి నిర్మూలన కోసం బలమైన యంత్రాగం ఏర్పాటుచేసి అవినీతిపరుల ఆస్తులను జప్తు చేయాలనేది మూడో డిమాండ్‌గా తెలిపారు. దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించి రాష్ట్రంలో పార్టీలకు వచ్చిన ఓట్లు ఆధారంగా సీట్లు నిర్ణయించాలని నాలుగో డిమాండ్‌గా కోరారు. ఈ అంశాలను పకడ్బందీగా నెరవేరిస్తే సురాజ్యం లభిస్తుందన్నారు. సమావేశంలో సోలిపేట రామచంద్రారెడ్డి, మాజీ మంత్రులు డాక్టర్ మాకినేని పెదరత్తయ్య, జె.ఐరామూర్తి, డాక్టర్ శనక్కాయల అరుణ, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి ధూళిపాళ్ళ రమాదేవి, పల్లెపు కృపారావు, బ్రహ్మయ్య, కళ్ళం హరినాథరెడ్డి, జూపూడి రంగరాజు, వినయ్‌కుమార్, కొరివి విజయ్‌కుమార్, వివిధ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**గుంటూరు**

# సుపరిపాలనతోనే సురాజ్యం : జేపీ

## విశాఖపట్టణం

సురాజ్య ఉద్యమం ద్వారా అవినీతిపై ప్రజల్లో చైతన్యం తీసుకురానున్నట్టు రాష్ట్ర సురాజ్య ఉద్యమం కన్వీనర్ డాక్టర్ జయప్రకాష్‌నారాయణ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. లోక్‌సత్తా హోటల్ దసపల్లాలో నిర్వహించిన సురాజ్య ఉద్యమం రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. డబ్బుతో ఓట్లు కొని అధికారంలోనికి రావాలని అన్ని రాజకీయపార్టీలు ఎజెండా పెట్టుకున్నాయన్నారు.

సురాజ్య ఉద్యమం ద్వారా ప్రజలను చైతన్యం చేసి, అవినీతి పరులు అందలం ఎక్కితే సమాజానికి వచ్చే నష్టాన్ని వారికి వివరించాల్సిన అవసరం ఉందన్నారు.

రూషికొండ ఐటీ పార్క్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నరేష్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని అధికారులలో నిజాయితీపరులను సత్కరించాలని అన్నారు. అత్యంత అవినీతిపరులైన అధికారులపై ఉద్యమించాలన్నారు. బీజేపీ జాతీయ కార్యదర్శి డాక్టర్ కుంభంపాటి హరిబాబు మాట్లాడుతూ, అధికార వికేంద్రీకరణ ద్వారా స్థానిక సంస్థలకు పూర్తి



అధికారాలు ఇస్తే పట్టణాలు, పల్లెలు బాగుపడతాయన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, బీజేపీ సీనియర్ నాయకులు పీవీ చలపతిరావు, టీడీపి జిల్లా అధ్యక్షులు చింతకాయల అయ్యన్న పాత్రుడు, సినీనటుడు కళ్ళు చిదంబరం, ప్రజాగాయకుడు వంగపండు ప్రసాదరావు, లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబ్జీ, జిల్లా అధ్యక్షుడు కుమార్, పీపుల్స్‌ఫర్ ఇండియా ఉపాధ్యక్షుడు బీఎల్‌నారాయణ, బీజేపీ నగర కమిటీ అధ్యక్షుడు ఎం.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కొత్త వ్యవస్థలతోనే సుపరిపాలన

### లోక్‌సత్తా నాయకులు వై.డి. రామారావు

## నర్సీపట్నంలో రౌండ్‌టేబుల్

ప్రజలకు మంచి పాలన అందించాలంటే అన్ని వ్యవస్థలను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని, దానికి కీలకమైన నాలుగు అంశాలపై సురాజ్య ఉద్యమం ప్రారంభమైందని లోకసత్తా నాయకులు వై.డి. రామారావు అన్నారు. పౌరసేవల హక్కు చట్టాన్ని తీసుకువచ్చి సకాలంలో లంచాలు లేకుండా ప్రభుత్వ సేవలు అందించాలని, అవినీతిని నిర్మూలించడానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలన్నారు. పరిపాలనను పూర్తిగా వికేంద్రీకరించి గ్రామ స్థాయికి తీసుకురావాలన్నారు. అక్టోబర్ రెండో తేది నుంచి కోటి మందికి స్వరాజ్య ఉద్యమ సందేశాన్ని చేరవేయాలని కార్యక్రమాలు రూపొంది స్తున్నామన్నారు. లోక్‌సత్తా నర్సీపట్నం నియోజక వర్గం నాయకులు తవ్వా చిరంజీవిరావు ఆధ్వర్యంలో చేపట్టని ఈ సమావేశంలో యువసత్తా రాష్ట్ర అధ్యక్షుడు శివాజీరాజు, సి.హెచ్.శ్రీనివాసరావు, అర్బన్ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**అన్ని పార్టీలు ఉద్యమానికి సహకరించాలి**

ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న తెదేపా మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ అవినీతిని తరిమికొట్టేందుకు అన్ని రాజకీయ పార్టీలు సురాజ్య ఉద్యమానికి సహకారం అందించాలన్నారు. ఈ సమావేశంలో వైకాపా నాయకులు బోళెం నర్సింహమూర్తి, మీసాల సత్యనారాయణ, పీలా వెంకట లక్ష్మి, బేతిరెడ్డి విజయ్‌కుమార్‌లు, భాజపా నేతలు డాక్టరు రామచంద్రరాజు, కోట్ని రామస్వామినాయుడు, సీపీఎంకు చెందిన డి.సత్తిబాబు, సీపీఐకు చెందిన రుత్తల పెద్దబుజ్జిలు తదితరులు కూడా ఈ స్వరాజ్య ఉద్యమానికి మద్దతు ప్రకటించారు.

# పౌరసమాజం స్పందిస్తేనే సురాజ్యం

**డా॥ రావు చెలికాని అధ్యక్షులు,** యునైటెడ్ ఫోరమ్ ఫర్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్



**శేరిలింగంపల్లి**
**వివేకానందనగర్**

లోక్‌సత్తా సురాజ్య ఉద్యమ సంస్థ, ఆధ్వర్యంలో సెప్టెంబర్9న సురాజ్య ఉద్యమ రౌండ్‌టేబుల్ సమావేశం వివేకానందనగర్ కాలనీలోని వడ్డేపల్లి కమలమ్మ సీనియర్ సిటిజన్స్ భవనంలో జరిగింది. రాష్ట్ర సురాజ్య ఉద్యమ కమిటీ సభ్యులు డా॥ రావు చెలికాని మాట్లాడుతూ పౌర సమాజం స్పందిస్తేనే సురాజ్య సాధ్యమని అన్నారు. డి.వి.వి.ఎస్.వర్మ మాట్లాడుతూ అధికార వికేంద్రీకరణ, పౌరసేవల హక్కు చట్టం దామాషా పద్ధతి ఎన్నికలు బలమైన స్వతంత్ర లోకాయుక్త నిర్మాణం కోసం కృషి చేయాల్సిన అవసరాలను వివరించారు. వివేకానందనగర్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్లలో తాగునీరు, రోడ్లు వంటి సమస్యలపై మాట్లాడారు. వీటి పరిష్కారం కోసం జేఎన్‌టీయూ రవాణా విభాగం ప్రొఫెసర్ లక్ష్మణరావు, జల వనరుల సంరక్షణ నిపుణుడు విజయసారధి ఆధ్వర్యంలో కాలనీ వాసులతో సమస్యల పరిష్కారం కోసం ఓ కమిటీల ఎంపిక చేశారు. ఈ కమిటీల ద్వారా ప్రజల హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో లోక్‌సత్తా డివిజన్ల నేతలు వెలగ శ్రీనివాసరావు, కాశ్యప్, నాగరాజు, సందీప్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# స్వరాజ్యం వచ్చినా సురాజ్యం రాలేదు

**లోక్‌సత్తా నాయకులు డి.వి.వి.యస్. వర్మ**




**మాదాపూర్**

దేశానికి స్వరాజ్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికి సురాజ్యం రాలేదని లోక్‌సత్తా నేత డి.వి.వి.ఎస్.వర్మ అన్నారు. లోక్‌సత్తా ఆధ్వర్యంలో 'సుపరిపాలన కోసం సురాజ్యం కోసం' అనే అంశంపై కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశంలో వర్మ మాట్లాడుతూ సురాజ్యం రావాలంటే ప్రజలను జాగృతం చెయ్యాలన్నారు. దేశ రాజకీయ వ్యవస్థ డబ్బు సంచులు, కులమతాల చుట్టూ తిరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకరావాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వాలు సైతం ఓటు బ్యాంక్‌ను సంపాదించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని చెప్పారు. లోక్‌సత్తా ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ దేశంలో పేదరిక నిర్మూలన, అందరికి విద్య అందాలంటే సుపరిపాలనతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాలనీ సమాఖ్య అధ్యక్షులు వి.బి.జె.రావు, ధర్మపురి క్షేత్రం ట్రస్టీ సత్యవాణి, లోక్‌సత్తా శేరిలింగంపల్లి అధ్యక్షులు వి.సురేందర్, హాఫీజ్‌పేట డివిజన్ అధ్యక్షులు బొల్లం రవి తదితరులు పాల్గొన్నారు.

# యువతలో ప్రశ్నించే తత్వం పెరగాలి : జేపీ




## విజయనగరంలో రౌండ్‌టేబుల్

విజయనగరంలో సురాజ్య ఉద్యమ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ జయప్రకాష్‌నారాయణ్‌కు విద్యార్థులు జాతీయ జెండాలు చేతపట్టి స్వాగతం పలికారు. మెసానిక్ టెంపుల్ జాతీయ జెండా అవిష్కరించి దివంగత పీవీజీ విగ్రహానికి పూలమాలంకరణ చేసి నివాళులు అర్పించారు. విద్యావంతులు, మేధావులు, రాజకీయవేత్తలు, యువత, విద్యార్థులతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జయప్రకాష్‌నారాయణ్ మాట్లాడుతూ ఏ చిన్న పని కూడా జరగని ప్రస్తుత ఈ వ్యవస్థలో ప్రశ్నించే తత్వం ప్రతి ఒక్కరిలో తప్పనిసరన్నారు. అధికారాన్ని కేంద్రీకరించకుండా అందరికీ భాగస్వామ్యం కల్పించాలన్నారు. మంచివాళ్లు రాజకీయానికి పనికిరారన్న ఆలోచనకు దూరం కావాలన్నారు. దామాషా ఎన్నికల విధానం రావాలన్నారు. విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ రాజకీయ వ్యవస్థ బూజు దులిపే శక్తి కేవలం యువత, విద్యార్థులకే ఉందన్నారు. సమాజంలో దురాచారాలను పారద్రోలటానికే ఆనాడే గురుజాడ కన్యాశుల్కం రాశారన్నారు. లోక్‌సత్తా నాయకులు భీశెట్టి బాబ్జీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్వాతంత్ర్య సమరయోధులు పసుమర్తి సుబ్బారావు, మాజీ ఎమ్మెల్యే కోళ్ల అప్పలనాయుడు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉద్యమానికి అందరూ తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

---

**(16వ పేజీ తరువాయి...)**

# విద్యను మించి మతం లేదు

నాలుగోది, మతాన్ని నిరంతరం ఆధునికీకరించాలి. మతం అంటే జాతుల మధ్య పోరాటాలుగా, ఒకరి మీద ఒకరికి ద్వేషాన్ని పెంచే ఏర్పాట్లతో ఉంటే ఒకరి వేళ్లతో మరొకరి కళ్లు పొడుచుకుని లోకమంతా చీకటి అవుతుంది. కాబట్టి మతాన్ని తర్కంవైపు నడిపించండి. ఈరోజు ఇంటర్నెట్, మొబైల్‌ఫోన్‌లు వంటి సాంకేతిక విజ్ఞానం వల్ల ప్రపంచానికి ఎల్లలు చెరిగిపోయాయి. అజ్ఞానాన్ని అంతం చేయటానికి పూర్వం ఎన్నడూ లేని అవకాశాలు ఇప్పుడు మనకున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటే మతాన్ని ఆధునికీకరించటంతోపాటు మతాన్ని తార్కికం చేయవచ్చు. తర్కానికి మతం అతీతంగా భావించి తర్కం లేనిదల్లా మతం అంటే అన్యాయమవుతుంది. తర్కానికి అందని అంశాలున్నాయి, వాటిని గురించి పట్టించుకుంటే అంగీకరించవచ్చుగానీ, తర్కాన్ని తిరస్కరించటమే మతం అంటే ఒప్పుకోను. అలాంటి మతాన్ని తిరస్కరించాలి. మతాన్ని తార్కికం చేయండి.

కాబట్టి, ఈ నాలుగు అంశాల కోసం.... అందరికీ నాణ్యమైన విద్య, దక్షిణాసియా, ఆ మాటకొస్తే, మనకింకా ఓపిక ఉంటే ప్రపంచంలోని ఏ మనిషి పట్ల వివక్ష చూపకుండా అంతరాల్ని, ఎల్లల్ని దాటి గౌరవించే సంస్కృతి, సంస్కారాల్ని ప్రదర్శించటం, అందుకుతగ్గ ఏర్పాట్లను మాటలలో కాకుండా చేతలలో చేయుటం, ఆడంబరాలతో కోట్లాదిమందికి అవమానాల్ని పంచిపెట్టే సంస్కృతికి స్వస్తిచెప్పి డబ్బుకు ధర్మకర్తలుగా వ్యవహరించే, సంపదసృష్టి మాత్రమే సంపదకు మూలంగా భావించే సమాజాన్ని నిర్మించటం, మతాన్ని ఆధునికీకరించటం, తార్కికం చేయటం కోసం మతాచార్యులు తమ విస్తృత వనరుల్ని, ప్రభావాన్ని ఉపయోగించాలి. ఆ నిజమైన ఆధ్యాత్మిక మార్పు కోసమే ఇంత నిష్కర్షగా మాట్లాడాను. ■

# రాయదుర్గంలో సురాజ్యం రౌండ్‌టేబుల్

## వివిధ పార్టీలు, ప్రజాసంఘాలతో రౌండ్‌టేబుల్

సుపరిపాలనతో ప్రజలకు స్వతంత్రజీవనం కోసం లోక్‌సత్తా సురాజ్య ఉద్యమాన్ని చేపట్టినట్లు లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు బండారు రామ్మోహన్ తెలిపారు. స్థానిక అర్‌అండ్‌వీ అతిథి గృహంలో రాజకీయపార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల నాయకులు, న్యాయవాదులతో సురాజ్య రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు రామ్మోహన్ రావు మాట్లాడుతూ నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి కోసం ప్రజలు చైతన్యవంతులు కావాలని, ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారానికి బలమైన స్థానిక ప్రభుత్వాలు అవసరమన్నారు. అవినీతిపరుల భరతం పట్టే లోకాయుక్త చట్టం అమలు చేయాలని కోరారు. డబ్బు, మద్యంతో సంబంధంలేని ఎన్నికల వ్యవస్థ రావాలన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్‌గౌని ఉపేంద్రరెడ్డి మాట్లాడుతూ వ్యవస్థలో మార్పురావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పారాళ్ల శ్రీనివాసులు, వరదా సదానంద, ఎన్టీ సిద్దప్ప, రఘురామ్, పద్మజ, టీడీపీ నాయకులు నాగరాజు, ప్రజాప్రగతి పరిరక్షణ సంఘం గౌరవాధ్యక్షులు సంజీవరెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మారెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, న్యాయవాది హరికృష్ణ ఏఐఎస్ఎఫ్ తాలుకా అధ్యక్షుడు గోవర్ధన్, లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనాథ్, కార్యదర్శి వన్నూరప్ప, మహిళా సత్తా జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, లోక్‌సత్తా నాయకులు బాబు, కార్యదర్శి అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బండారు రామ్మోహన్‌రావు

## పూలకుంటలో 'సురాజ్యం' ప్రచారం




మంచి వసతుల కోసం స్థానిక ప్రభుత్వాలను సురాజ్య ఉద్యమం ద్వారా సాధించుకోవాలని పూలకుంట గ్రామంలో జరిగిన ప్రచార సమావేశంలో లోక్‌సత్తా నాయకులు బి.బాబు ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు ఎస్.కె.అబ్దుల్లా, తిప్పేస్వామి, నాగరాజు, వన్నూరుస్వామి, లోకేష్, గ్రామీణ ప్రజలు పాల్గొన్నారు.

## సురాజ్యంలో విద్యార్థులు పాత్ర



### వినుకొండ

పట్టణంలోని శ్రీ వాణి జూనియర్ కాలేజి ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు సురాజ్య ఉద్యమ అవశ్యకత పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజి డైరెక్టర్ కె. రమేష్ మాట్లాడుతూ దేశసంపద దోపిడీకి గురవుతుందని, దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. అవినీతిలేని పౌర సమాజ స్థాపన విద్యార్థుల చేతుల్లో ఉందన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ జె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, జి.శ్రీనివాసరావు, రామకృష్ణ వెంకినాయుడు, నారాయణరెడ్డి, చెన్నయ్య, అధ్యాపకులు, సురాజ్య ఉద్యమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వివిధ రాష్ట్రాలలో పంచాయితీలలో బి.సి. రిజర్వేషన్లు

- యస్.టి, యస్.సి. లకు వారి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు వుంటాయి.
- బి.సిలకు ఆయా రాష్ట్రాలలో నిర్ణయించిన కోటా మేరకు రిజర్వేషన్లు వుంటాయి. రాజ్యంగంలో ఈ తరగతులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కట్టించనందున కోటా పద్ధతి పాటిస్తున్నారు.
- అలాగే మహిళలకు కూడా కోటా పద్ధతే వుంటుంది. పోతే ఈ కోటా ప్రత్యేకంగా లేకుండా ఆయా తరగతుల కోటాలో, జనరల్ కోటాలో భాగంగా వుంటాయి. రాజ్యంగం ప్రకారం వీరికి స్థానిక ప్రభుత్వాలలో 33 1/3శాతం కోటా నిర్ణయించబడింది. ఇది ప్రత్యేక కోటా కానందున కొన్ని రాష్ట్రాలు 50 శాతం కోటాను నిర్ణయించాయి.

| రాష్ట్రంపేరు | యస్.సి | యస్.టి | బి.సి | మొత్తం |
|---|---|---|---|---|
| 1. గుజరాత్ | 15శాతం | 7 శాతం | 10శాతం | 32 శాతం |
| 2. కర్నాటక | 15 | 3 | 32 | 50శాతం |
| 3. ఒరిస్సా | 16.53 | 22.13 | 27 | 65.66 (2012లో ఎన్నికలు జరగాలి) |
| 4. తమిళనాడు | 18 | 1 | బి.సి.లకు రిజర్వేషన్లు లేవు | |
| 5. బీహారు | జనాభా ప్రాతిపదిక | జనాభా ప్రాతిపదిక | గరిష్టంగా 20 శాతం | మొత్తంమీద 50శాతానికి మించకూడదు |
| 6. మహారాష్ట్ర | 13 | 7 | 27 | 47 శాతం |
| 7. గోవా | - | - | - | మొత్తంమీద 50శాతం లోపు |
| 8. పశ్చిమ బెంగాల్ | జనాభా ప్రాతిపదిక | జనాభా ప్రాతిపదిక | లేదు ఇటీవల 17% బిల్లు | 50 శాతం లోపు |
| 9. కేరళ | 10 | 10 | లేదు | |
| 10. మధ్యప్రదేశ్ | 16 | 20 | లేదు | |
| 11రాజస్థాన్ | జనాభా ప్రాతిపదిక | జనాభా ప్రాతిపదిక | 21శాతం మించకుండా | మొత్తంమీద 50శాతం |
| 12. ఉత్తరప్రదేశ్ | 21 | 2 | 27 | 50శాతం |

## రాజమండ్రిలో సురాజ్య ఉద్యమం

ఆగస్టు 19న రాజమండ్రిలో సురాజ్య ఉద్యమాన్ని గోకవరం బస్టాండు గాంధీ విగ్రహానికి పూలదండ వేసి ప్రతిజ్ఞ చేసి సురాజ్య ఉద్యమాన్ని ప్రారంభించారు.

డా॥ రామారావు, యం.వి.రాజగోపాల్, ఎన్.ఎస్.ఆర్.మూర్తి శ్రీ కాళేశ్వరరావులు మాట్లాడారు.

ఆగస్టు 31వ తేదీన సురాజ్య సన్నాహక కమిటీ సమావేశం జరిగింది. సురాజ్య ఉద్యమ లక్ష్యాలు సాధించే మార్గాలపై చర్చ జరిపిన అనంతరం రాజమండ్రిలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.



## రాజమండ్రిలో పౌరసేవా కేంద్రం

లోక్‌సత్తా పౌరసేవా కేంద్రం ఆధ్వర్యంలో మే 27న స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పెట్రోల్ ధర పెంపు, మద్యం కుంభకోణాల గురించి రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వ హించారు.

జూన్ 21వ తేదీన మున్సిపల్ కమీషనర్‌తో పారిశుధ్యం పై 8 వార్డు అపార్టుమెంట్ ఆవరణలో సమావేశం నిర్వహించారు.

జూలై 5వ తేదీన పట్టణంలో రేషన్ షాపుల నిర్వహణ, వాటి లోకేషన్‌పై సబ్‌కలెక్టరుతో చర్చించి, నివేదిక ఇచ్చారు.

ఈ కార్యక్రమాలు యం.వి.రాజగోపాల్ ఆధ్వర్యంలో జరిగాయి.



Lok Satta Party National Meeting
2012 September 1, 2 - Hyderabad




## సురాజ్యంలో విద్యార్థులు






RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12







To,

**Book-Post**

PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad